www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00
Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 194 | గురువారం | 9 జులై, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169



## ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌కు
# రంగం సిద్ధం

### ఖమ్మంలో రూ.300 కోట్లతో గోద్రేజ్ ఆగ్రోవెట్ భారీ పెట్టుబడి

- ప్రాసెసింగ్ యూనిట్, నర్సరీ, ఆర్అండ్‌డీ కేంద్రం ఏర్పాటు
- 700 మందికి పైగా ఉపాధి
- ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో తొలి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఖమ్మం జిల్లాలో గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 700 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతిపై గోద్రేజ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పొరేట్ వ్యవహారాల అధ్యక్షుడు రాకేశ్ స్వామి, గోద్రేజ్ ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ప్రాసెసింగ్ సామర్థ్యాల పెంపుపై సంస్థ రూపొందించిన కార్యాచరణను సీఎంకు వివరించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో తరువాయి 2లో..

### తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి
- సీఎం రేవంత్‌తో కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ భేటీ
- మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై చర్చలు

2

# ముంచెత్తిన కుండపోత





### జల దిగ్బంధంలో ముంబై, ఢిల్లీ
### గుజరాత్‌లో వరదలకు 9మంది బలి

- పలు రాష్ట్రాల్లో రైళ్లు, విమాన రాకపోకలకు అంతరాయం
- కేరళ, హిమాచల్, ఉత్తరాఖండ్‌లో సహాయక చర్యలు ముమ్మరం
- పుణెలో చెత్తకుప్ప కూలి భవనం ధ్వంసం.. శిథిలాల కిందే 17 మంది
- ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్ష



నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు బుధవారం జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా పలు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నదులు పొంగిపొర్లగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వరదనీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. రైలు, విమాన సర్వీసులు తీవ్ర అంతరాయానికి గురయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, భవనాలు కూలిపోవడం, వరదలు ముంచెత్తడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మహారాష్ట్రలోని పుణె సమీపంలోని పింప్రి-చించ్‌వడ్‌లో చెత్తకుప్ప కూలి మూడు అంతస్తుల భవనం నేలమట్టం కావడంతో 17మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. గుజరాత్‌లో వర్షాలకు సంబంధించిన ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి చెందారు. పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి సహాయక చర్యలను సమీక్షించారు.



### ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా
3

- హర్మూజ్ ఉద్రిక్తతలతో మరో విడత వైమానిక దాడులు
- వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతీకార చర్యలంటూ వెల్లడించిన వాషింగ్టన్
- గగనతల రక్షణ వ్యవస్థలు, రివల్యూషనరీ గార్డ్ స్థావరాలే లక్ష్యమని ప్రకటన

### మళ్లీ యుద్ధ మేఘాలు!
2

# తాడిచెర్ల బొగ్గు బ్లాక్ కొత్తది కాదు

### 2013లోనే అప్పటి ప్రభుత్వం సింగరేణికి కేటాయించింది

- ఇప్పుడిచ్చింది మైనింగ్ లీజుకు సంబంధించిన అనుమతులే
- కేంద్రం వాస్తవాలను వక్రీకరిస్తోంది
- కిషన్‌రెడ్డికి ప్రేముంటే గోదావరి పరీవాహకంలోని అన్ని కోల్ బ్లాక్‌లను సంస్థకు అప్పగించాలి: భట్టి



**ప్రజానావ, హైదరాబాద్:** తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం కొత్తగా సింగరేణి కాలరీస్‌కు కేటాయించినట్లు ప్రచారం చేయడం పూర్తిగా వాస్తవ విరుద్ధమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ బొగ్గు బ్లాక్‌ను 2013లోనే అప్పటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి అధికారికంగా కేటాయించిందని, ప్రస్తుతం లభించినది కొత్త కేటాయింపు కాదని, కేవలం మైనింగ్ లీజుకు సంబంధించిన అనుమతులేనని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కేంద్రం చేస్తున్న ప్రచారం సమంజసం కాదని విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన పూర్తి చరిత్రను వివరించారు. 2021లోనే సింగరేణి మైనింగ్ లీజు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దానిని సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉంచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థకు ఇవ్వాల్సిన లీజును అనవసరంగా ఆలస్యం చేయడం వల్ల సింగరేణికి వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ లీజు మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన పూర్తి వివరాలను వివరించామని చెప్పారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా ప్రత్యేక వినతిపత్రం అందజేసి లీజు మంజూరు చేయాలని కోరినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కృషి తరువాయి 2లో..




# కాళేశ్వరంపై నిజాలు చెప్పండి

### కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయాలకు దెబ్బతింటున్న తెలంగాణ ప్రయోజనాలు

- గోదావరి జలాల అంశంలో రెండు పార్టీలూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి
- కన్నెపల్లి పంప్‌హౌస్ ముంపుపై విచారణ ఎందుకు నిలిచిపోయింది?
- ప్రాణహిత వరద జలాలను వెంటనే ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలి
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్

**ప్రజానావ, హైదరాబాద్:** గోదావరి జలాలు, కాళేశ్వరం ప్రాజెక్టు అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ ప్రయోజనాలకే పరిమితమవుతున్నాయని, ఈ పరిణామాల వల్ల తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్ విమర్శించారు. గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ వంటి కీలక అంశాల్లో ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా రెండు పార్టీలు ఒకదానిపై మరొకటి విమర్శలు చేసుకోవడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని ఆరోపించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ముంపు కారణంగా భారీగా ప్రజాధనం వృథా అయిందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దీనిపై విచారణ ఎందుకు నిలిచిపోయిందో ప్రజలకు వివరించాలని నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ తరువాయి 2లో..



# కేంద్రంపై దుష్ప్రచారం

- ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ సర్కార్ విఫలం
- 53 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఇప్పటికే కేంద్రం ఆమోదం
- బియ్యం మిల్లింగ్, ఎఫ్‌సీఐకి సరఫరాలో రాష్ట్రం నిర్లక్ష్యం
- రైతు గోస ఉద్యమం తర్వాతే వేగం పుంజుకున్న కొనుగోళ్లు
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ:** ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే దుష్ప్రచారం చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకారం తెలిపిందని, అయినప్పటికీ కొనుగోళ్లు, మిల్లింగ్, బియ్యం సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ ప్రతినిధి బృందం కలిసింది. ధాన్యం కొనుగోళ్లు, తరువాయి 2లో..



# మళ్లీ యుద్ధ మేఘాలు!

- అమెరికా – ఇరాన్ ఉద్రిక్తతతో చమురు మార్కెట్లలో కలకలం
- కాల్పుల విరమణపై అనిశ్చితి
- ప్రపంచ ఇంధన ధరలపై ఆందోళన
- హార్మూజ్ జలసంధిలో ట్యాంకర్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- వారాల గరిష్ఠానికి ముడి చమురు ధరలు.. పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం
- ప్రపంచ దేశాల్లో పెరుగుతున్న ఆందోళన

**న్యూయార్క్:** అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న కాల్పుల విరమణపై మళ్లీ సందిగ్ధత నెలకొనడంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు మరోసారి ఒత్తిడికి గురయ్యాయి. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిస్పందనగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ ముగిసినట్లేనని ప్రకటించడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో అనిశ్చితి పెరిగింది. ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్ల రాకపోకలు దాదాపు నిలిచిపోవడం, నౌకాయాన సంస్థలు అప్రమత్తం కావడం వల్ల ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. ఈ పరిస్థితి కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని ఇంధన రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లు వెంటనే స్పందించాయి. అమెరికా బెంచ్ మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ధర బ్యారెల్‌కు 75.80 డాలర్లకు చేరుకోగా, బ్రెంట్ క్రూడ్ ధర 79 డాలర్లకు చేరువైంది. గత కొన్ని వారాల్లో ఇదే అత్యధిక స్థాయి. ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావం రానున్న రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలపై కూడా కనిపించే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### నిలిచిన రాకపోకలు

ప్రపంచ చమురు రవాణాలో కీలక మార్గంగా భావించే హార్మూజ్ జలసంధిలో భద్రతా పరిస్థితులు క్షీణించడంతో చమురు ట్యాంకర్ల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. కొన్ని నౌకలు తమ ప్రయాణ వివరాలను ప్రసారం చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. సముద్ర మార్గాల్లో మైన్లు, దాడుల ముప్పు కొనసాగుతుండటంతో అంతర్జాతీయ షిప్పింగ్ సంస్థలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులను అంతర్జాతీయ సముద్ర రవాణా సంస్థ (ఐఎంఓ) తీవ్రంగా ఖండించింది. నౌకా సిబ్బంది భద్రతకు పూర్తి హామీ లభించే వరకు ఆ మార్గంలో నౌకలను నడపడంపై పునరాలోచించాలని సభ్య దేశాలు, నౌక యజమానులు, షిప్పింగ్ ఆపరేటర్లకు సూచించింది. ప్రాంతంలో పరిస్థితులు ఇంకా అత్యంత ఉద్రిక్తంగానే ఉన్నాయని పేర్కొంది. ఇదిలాఉంటే యుద్ధ ప్రభావంతో పెరిగిన చమురు ధరలను అదుపు చేసేందుకు అమెరికా సహా పలు దేశాలు తమ అత్యవసర చమురు నిల్వలను వినియోగిస్తున్నాయి. అయితే ప్రస్తుతం అమెరికా వ్యూహాత్మక చమురు నిల్వలు గత నాలుగు దశాబ్దాల్లో కనిష్ఠ స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉద్రిక్తతలు మరింత పెరిగితే ధరలను నియంత్రించే అవకాశాలు పరిమితమవుతాయని ఇంధన రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### సూయజ్ మార్గంపైనా ప్రభావం

మధ్యప్రాచ్యంలో నెలకొన్న తాజా పరిణామాలు అంతర్జాతీయ నౌకాయాన రంగాన్నీ ప్రభావితం చేస్తున్నాయి. ఎర్ర సముద్రంలో పరిస్థితులు మెరుగుపడటంతో సూయజ్ కాలువ మార్గంలో సేవలను పునరుద్ధరించాలని నిర్ణయించిన ప్రముఖ షిప్పింగ్ సంస్థలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో తమ నిర్ణయాన్ని మరోసారి సమీక్షిస్తున్నాయి. పరిస్థితి మరింత దిగజారితే ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించాయి. అయితే తాజా పరిణామాలు తక్షణమే పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయకపోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ దౌత్య చర్చలకు తలుపులు పూర్తిగా మూసుకుపోలేదని పేర్కొంటున్నారు. చర్చలు ఫలిస్తే పరిస్థితి మళ్లీ అదుపులోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్రిక్తతలు మరింత ముదిరితే ప్రపంచ ఇంధన మార్కెట్లతో పాటు రవాణా, వాణిజ్య రంగాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## 20 నుంచి బల్కంపేట బోనాలు

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి కొండా సురేఖ
- జాతర, కల్యాణోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో అత్యంత వైభవం గా జరిగే బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి బోనాల జాతర, వార్షిక కళ్యాణోత్సవాలకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జులై 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు లక్షలా ది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పనిచేసి భక్తుల కు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా చూడాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో బల్కంపేట ఎల్లమ్మ బోనాల జాతర, కళ్యాణోత్స వాల పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం పోలీసు, జీహెచ్ఎంసీ, విద్యుత్, ఆర్టీసీ, వైద్య, దేవాదాయ శాఖల అధికారుల తో ప్రత్యేక సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. 21న ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనుండ గా, 22 సాయంత్రం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

### భక్తులక అన్ని సౌకర్యాలు కల్పించాలి

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దర్శనం అష్టాదశ శక్తిపీఠాల దర్శనంతో సమానమనే విశ్వాసంతో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని మంత్రి పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత, మొబైల్ మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు, తగిన వెలుతురు వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తిచేయాలని జీహెచ్ ఎంసీ అధికారులకు సూచించారు. మహిళలు, వృ ద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పా టు చేసి సులభ దర్శనానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రమాదాల నివారణకు విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బల్కంపేట బోనాల జాతరను రాష్ట్ర ప్రతిష్ఠకు తగిన రీతిలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.





# ముంచెత్తిన కుండపోత

- జల దిగ్బంధంలో ముంబై, ఢిల్లీ
- గుజరాత్‌లో వరదలకు 9 మంది బలి
- పలు రాష్ట్రాల్లో రైళ్లు, విమాన రాకపోకలకు అంతరాయం
- కేరళ, హిమాచల్, ఉత్తరాఖండ్‌లో సహాయక చర్యలు ముమ్మరం
- పుణెలో చెత్తకుప్ప కూలి భవనం ధ్వంసం.. శిథిలాల కిందే 17 మంది
- ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్ష

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలోని పుణె జిల్లా మోషీ ప్రాంతంలో బుధవారం వ్యర్థాల శుద్ధి కేంద్రం వద్ద భారీ చెత్తకుప్ప ఒక్కసారిగా జారి పక్కనే ఉన్న మూడు అంతస్తుల భవనంపై పడింది. వ్యర్థాల ప్రాసెసింగ్ సంస్థ కార్యాలయంగా వినియోగిస్తున్న ఈ భవనంలో ప్రమాదం జరిగిన సమయంలో 23 మంది ఉన్నారు. వారిలో కొందరిని సురక్షితంగా బయటకు తీసుకు రాగా, ఇంకా 17 మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ, స్థానిక యంత్రాంగం సంయుక్తంగా సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. ముంబైలో మళ్లీ కుండపోత వర్షాలు కురవడంతో నగర జీవనం స్తంభించింది. సబర్బన్ రైళ్లు 25 నుంచి 30 నిమిషాల ఆలస్యంగా నడవగా, పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రతికూల వాతావరణం, తక్కువ దృశ్యమానత కారణంగా ముంబై విమానాశ్రయానికి రావాల్సిన తొమ్మిది విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. వసాయి–విరార్ రైల్వే మార్గంలో ట్రాక్‌లపై నీరు చేరడం, భోర్‌ఘాట్‌లో కొండచరియలు విరిగిపడటంతో దూరప్రాంత రైళ్ల సేవలు కూడా దెబ్బతిన్నాయి.

### కేరళ నుంచి ఉత్తరాఖండ్ వరకు అప్రమత్తం

కేరళలోని వయనాడ్‌లో సొరంగ నిర్మాణ ప్రాంతంలో మట్టికుప్ప కూలిన ఘటనలో అదృశ్యమైన ఐదుగురి కోసం గాలింపు కొనసాగుతోంది. హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడటంతో దాదాపు 70 రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో డెహ్రాడూన్‌తో పాటు పలు జిల్లాల్లో గురువారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు. సహాయక బృందాలను అప్రమత్తంగా ఉంచి పునరావాస చర్యలను వేగవంతం చేశారు. భారీ వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, సహాయక, పునరావాస కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు.



### సూరత్‌లో వరదల బీభత్సం

గుజరాత్‌లోని సూరత్‌లో 24 గంటల్లో 358 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవడంతో వరద పరిస్థితులు నెలకొన్నాయి. లోతట్టు ప్రాంతాల నుంచి 3,800 మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 3,400 మందిని సహాయక బృందాలు రక్షించాయి. విద్యుదాఘాతాలు, చెట్లు కూలడం, మునిగిపోవడం వంటి ఘటనల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లోకి వరదనీరు చేరడంతో సాధారణ జీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. దేశ రాజధాని ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పలు ప్రాంతాలు నీటమునిగాయి. రోహిణిలో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనం కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్, జాతీయ రహదారి–48పై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. గురుగ్రామ్‌లోనూ ప్రధాన రహదారులన్నీ జలమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి

- సీఎం రేవంత్‌తో కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ భేటీ
- మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై చర్చలు
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు ఆహ్వానం



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబడుల విస్తరణతో పాటు పలు కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కెనడాతో చర్చలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో సమావేశమై పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, హరిత ఇంధనం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులపై కెనడా ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలను పరిశీలించేందుకు ఇరు వర్గాలు అంగీకరించాయి. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనాలని కెనడా కంపెనీలకు ముఖ్యమంత్రి ఆహ్వానం పలికారు. రాష్ట్రంలో ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో నమోదవుతున్న వేగవంతమైన పురోగతిని వివరించిన సీఎం, హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారాన్ని కోరారు. హైదరాబాద్ లో కెనడా విశ్వవిద్యాలయాల మల్టీ క్యాంపస్‌ల ఏర్పాటు అవకాశాలను కూడా ముఖ్యమంత్రి ప్రతిపా దించారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, నైపుణ్యము న్న మానవ వనరులు, పారిశ్రామిక విధానాల గురించి వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రతినిధి బృందం కెనడాలో పర్యటించాలని హైకమిషనర్ క్రిస్ కూటర్ ఆహ్వానిం చారు. తెలంగాణపై కెనడా సంస్థల విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొంటూ, రాష్ట్రం పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనలో సాధిస్తున్న విజయాలను ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభి వృద్ధి, డిఫెన్స్ తదితర రంగాలకు చెందిన కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం త్వరలో తెలంగాణలో పర్యటించనున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందించేందుకు కెనడా సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ ప్రతినిధులు నిలి గిల్బర్ట్, మహేశ్ కొండూరు, అమిత్ మెహ్రా, దిలెక్, థామస్ ఫ్రోలిక్, సెంథిల్ తొండమాన్ తదితరులు ముఖ్యమంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

## కాళేశ్వరంపై నిజాలు చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమైన తర్వాత దానిని ముందుకు తీసుకెళ్లకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ముంపునకు కారణమైన నిర్మాణ సంస్థలపై బాధ్యత నిర్ధారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రాణహితలో తగినంత వరద ప్రవాహం ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిని వినియోగించడంలో విఫలమవుతోందని ఆయన ఆరోపించారు. రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ దాన్ని వదులుకుంటున్నారని అన్నారు. వెంటనే ఎత్తిపోతల ప్రక్రియ ప్రారంభిస్తే రైతులకు సాగునీరు అందడంతో పాటు హైదరాబాద్‌కు తాగునీటి సమస్య కూడా గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర దర్యాప్తు జరపాలి

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకే కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులు, వ్యయాలు, కాంట్రాక్టులు, మూడో టీఎంసీ పనులకు జరిగిన బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రజాధనం వినియోగంపై పూర్తి పారదర్శకత తీసుకురావాలని కోరారు. మహారాష్ట్రతో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని ఆయన ప్రశ్నించారు. గోదావరి జలాల అంశంలో రాజకీయాలు పక్కనపెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు. లేనిపక్షంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## తాడిచెర్ల బొగ్గు బ్లాక్ కొత్తది కాదు

(మొదటిపేజీ తరువాయి)



ఫలితంగానే లీజు అనుమతులు లభించాయని, దానిని కొత్త కేటాయింపుగా ప్రచారం చేసుకోవడం సరికాదనా రు. ఇక గిరిజన ప్రాంతాల్లోని బొగ్గు గనులను చట్టం ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలు లేదా గిరిజన సంస్థలకే కేటాయించాల్సి ఉంటుందని భట్టి విక్రమార్క పేర్కొన్నా రు. అలాంటి పరిస్థితు ల్లో తాడిచెర్ల–2ను కొత్తగా కేటాయిం చినట్లు చెప్పడం వాస్తవాలను వక్రీకరించడమే నని అన్నారు. కోయగూడెం–3, సత్తుపల్లి–3 బొగ్గు బ్లాక్‌లను వెంటనే సింగరేణికి అప్పగించాలని ఉప ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. 2022లో కోయగూడెం–3 బ్లాక్‌ను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు సంస్థకు కేటాయించారని, అయితే ఇప్పటివరకు అక్కడ తవ్వకాలే ప్రారంభం కాలేదని విమర్శించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని అన్ని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగిస్తేనే కేంద్రానికి సంస్థపై నిజమైన చిత్తశుద్ధి ఉందని నిరూపితమవుతుందని అన్నారు.

### బీఆర్ఎస్ వైఖరిపైనా విమర్శలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా సింగరేణి ప్రయోజనాలను విస్మరించిందని భట్టి ఆరోపించారు. బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనే అవకాశాన్ని కూడా కల్పించకుండా సంస్థకు నష్టం కలిగించిందని విమర్శించారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని తెలంగాణలోని అన్ని బొగ్గు గనులు, గోదావరి పరీవాహక ప్రాంతంలోని కోల్ బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కేంద్రంపై దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

బియ్యం సేకరణకు సంబంధించిన అంశాలపై వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మాట్లాడిన కిషన్‌రెడ్డి, బీజేపీ చేపట్టిన రైతు గోస కార్యక్రమం తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేసిందని పేర్కొన్నారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపినా, ఇప్పటివరకు ఎఫ్‌సీఐకి 13–14 శాతం బియ్యం కూడా రాష్ట్ర ప్రభుత్వం పంపలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. మిల్లింగ్‌ను వేగవంతం చేసి ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు.

### రూ.60 వేల కోట్లకుపైగా రుణాలు

ధాన్యం కొనుగోళ్ల కోసం కేంద్రం ఎఫ్‌సీఐ ద్వారా రాష్ట్రాలకు రుణాలు అందిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. 2025–26లో తెలంగాణకు రూ.37 వేల కోట్లు, 2026–27లో మరో రూ.23 వేల కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పేదలకు పంపిణీ చేసే సన్నబియ్యం వ్యయంలోనూ 70 శాతం వరకు కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ఢిల్లీలో ధర్నా చేసినా తమకు అభ్యంతరం లేదని, వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులు పండిస్తున్న ధాన్యం పరిమాణానికి అనుగుణంగా నిల్వ, మిల్లింగ్ మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు.

### ఆరు రెట్లు ఎక్కువ కొనుగోళ్లు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల నుంచి 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. యూపీఏ–2 హయాంలో 24.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఆ సంఖ్య 146.33 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనతో పోలిస్తే ఆరు రెట్లు అధికంగా కొనుగోళ్లు జరిగాయని చెప్పారు. వరికి ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.2,369 మద్దతు ధర చెల్లిస్తుండగా, కాంగ్రెస్ హయాంలో అది రూ.1,300 మాత్రమేనని గుర్తు చేశారు. తెలంగాణ రైతుల పక్షాన బీజేపీ ఎప్పుడూ నిలుస్తుందని,

## ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌కు రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాసెసింగ్ మిల్, నర్సరీ, పరిశోధన–అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్‌కు కేటాయించింది. సీడ్ గార్డెన్ విస్తరణ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని సంస్థ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రాసెసింగ్ మిల్‌కు అనుసంధానంగా రహదారిని విస్తరించాల్సిన అవసరాన్ని కూడా వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో రహదారి విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, విలువ ఆధారిత వ్యవసాయ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణలో వ్యవసాయ ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

### ముఖ్యమంత్రితో మలేసియా ఎంపీ శరవణన్ భేటీ

ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం మలేసియా పార్లమెంట్ సభ్యుడు డా. ఎం.శరవణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వచ్చిన శరవణన్ సీఎంతో భేటీ అయ్యారు. సీఎంని కలిసిన వారిలో గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 పాల్గొన్న మరికొందరు అంతర్జాతీయ ప్రతినిధులున్నారు. పర్యావరణ, సామాజిక, పరిపాలన పరమైన అంశాలతో పాటు మౌలిక సదుపాయాలు, ఏఐ వినియోగంతో పాటు భవిష్యత్తు పెట్టుబడులపైన ముఖ్యమంత్రి, శరవణన్, అంతర్జాతీయ ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

- రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన
- నాగర్‌కర్నూల్ – వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం
- ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజానావ, నాగర్‌కర్నూల్ :** రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని డా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులు

ప్రజానావ, వేములవాడ: వేములవాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రాజన్న ఆలయం నుంచి బ్రిడ్జి వరకు చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వేములవాడ ప్రాంతంతో ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉందన్నారు. ప్రజాపథం కార్యక్రమంలో భాగంగా మల్యాల గ్రామంలో రూ.1,737 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల సాగునీటి పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం రాష్ట్రానికి తీరని లోటుగా మిగిలిపోయిందన్నారు. 2009లో రుద్రంగి, జోగాపూర్, చందుర్తి ప్రాజెక్టులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ హయాంలో కలికోట సూరమ్మ చెరువు, మర్రిపల్లి ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వేములవాడ ప్రాంత అభివృద్ధికి పలు సాగునీటి ప్రాజెక్టులకు వైఎస్సార్ అంకురార్పణ చేశారని, ఏఎండీ నుంచి వేములవాడకు నీటి సరఫరా కల్పించే చర్యలు చేపట్టారని చెప్పారు. అగ్రహారంలో ఎలాంటి కార్పస్ ఫండ్ లేకుండానే సైన్స్ వింగ్‌ను ఏర్పాటు చేశారని, వరద కాల్వతో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కూడా విశేష కృషి చేశారని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయానికి అండగా నిలిచారని అన్నారు. పేద ప్రజల ఆరాధ్య దైవంగా నిలిచిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌లో 27 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశం

- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష
- 37 మందికి నిర్వహించిన ఇంటర్వ్యూలలో 27 మంది ఎంపిక
- జూలై 22 నుంచి హైదరాబాద్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ
- ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్న సంస్థ
- శిక్షణ అనంతరం ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యకు అవకాశం
- ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్



ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూలలో 27 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 37 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) పెద్దపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) మంథని, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) పెద్దపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) గోదావరిఖని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మారం, మైనారిటీ జూనియర్ కళాశాల (బాలికలు) మంథని, మోడల్ స్కూల్ధర్యాపూర్ తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 22 నుంచి హైదరాబాద్‌లో మూడు నెలల పాటు ఉచిత భోజనం, వసతితో కూడిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే విధంగా ఈ శిక్షణ ఉండనున్నదని చెప్పారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఉన్నత విద్యను కొనసాగించేందుకు కూడా కంపెనీ అవసరమైన సహకారం అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలను జిల్లాకు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 27 మంది విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించి, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి సంస్థలో మంచి ప్రతిభ కనబరచడంతో పాటు తమ కుటుంబాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన, జిల్లా యువజన క్రీడల అధికారి సురేష్ , గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ ఎం. ప్రభాకర్ రావు, హెచ్‌ఆర్ ప్రతినిధి ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ పూర్తి చేయాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచాలని అధికారులకు కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశం
- ప్రజల్లో అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలి

ప్రజానావ, ఖమ్మం: జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను వంద శాతం తిరిగి సేకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌లతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లు పూరించి సమర్పించిన ఫారాలను బీఎల్‌ఓలు సేకరించి డిజిటలైజేషన్ చేస్తారని, ఆ వివరాల ఆధారంగానే ఓటరు ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ రోల్) సిద్ధమవుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో 99.07 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, అందుబాటులో లేని 3,744 మంది ఓటర్ల వివరాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇప్పటివరకు 31.57 శాతం ఫారాలను తిరిగి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంపన్న రాష్ట్రం అంటూ ప్రపంచ బ్యాంక్ నివేదిక

- రాష్ట్రం వస్తే ఏమొచ్చిందన్న వారికిదే సమాధానం
- ఎక్స్ వేదికగా కేటీఆర్ హర్షం

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ ఎగువ మధ్యాదాయ స్థాయిని దాటిన సంపన్న రాష్ట్రమంటూ ప్రపంచబ్యాంకు నివేదికను వెల్లడించడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దేశంలో ఈ హోదాను సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం గర్వకారణమన్నారు. తెలంగాణ విఫల రాష్ట్రం కాలేదని.. సఫల సంపన్న రాష్ట్రమై సగర్వంగా నిలిచిందని పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రజలు గర్వించే సందర్భం ఇది! సాధించుకున్న స్వరాష్ట్రం సంపన్న రాష్ట్రంగా అవతరించింది! తెలంగాణ రాష్ట్రం అప్పర్ మిడిల్ ఇన్‌కం బెంచ్ మార్క్‌ను దాటి ఎదిగిందని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది! దేశంలో ఈ హోదాను సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం మనకు గర్వకారణం అన్నారు. తమ చెమటను.. నైపుణ్యాన్ని.. మేధస్సును రంగరించి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ శుభాభివందనాలు! తెలంగాణ వస్తే ఏమొచ్చింది? జాతి సంపద పెరిగింది.. జనం ఆదాయం అద్భుతంగా పెరిగింది! సీఆర్ దార్శనిక పాలనలో ఆర్థిక వ్యవస్థ అద్వితీయంగా అభివృద్ధి చెందిందని జాతీయ నివేదికలే కాదు.. అంతర్జాతీయ సంస్థలు తేల్చిచెబుతున్నాయి..! దివాలా రాష్ట్రం అని దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు ప్రపంచ బ్యాంకు తాజా నివేది సమాధానం..!' అని ఎక్స్‌లో టీఆర్ పోస్ట్ చేశారు.

# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్



ప్రజానావ, హైదరాబాద్ : గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికి గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందు సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులు తున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు డా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయవచ్చన్నారు. సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి డా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు.మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనులంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనులిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు డా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగెటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి డా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు ంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు. 'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

# ఆర్డీఎస్ ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం

**రాజోలి బండ డైవర్షన్ స్కీమ్‌ను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు**

ప్రజానావ, మహబూబ్‌నగర్ : తుంగభద్ర జలాల దోపిడీతో ఆర్డీఎస్ ఆయకట్టు ఎడారిగా మారుతుందని బిఆర్ఎస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లా మొదటగా అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. కొడంగల్‌కు ఎన్వోసీ కోసం ఏపీ, కర్ణాటక మిగతా ప్రాజెక్టులకు రేవంత్ ఎన్వోసీ ఇచ్చినట్లు సమాచారం తమకు ఉందని వెల్లడించారు. కర్ణాటకలోని రాజోలి బండ డైవర్షన్ స్కీమ్‌ను బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరిశీలించారు. మాజీ మంత్రులు డా. సి.లక్ష్మారెడ్డి ,శ్రీనివాస్ గౌడ్ , ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతర నాయకులు రాజోలి బండను సందర్శించిన వారిలో ఉన్నారు. కొడంగల్ లిఫ్ట్ అనేది అనవసరమైన ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. పనికి రాని ప్రాజెక్ట్ కోసం తెలంగాణ హక్కులను కోల్పోతున్నామని తెలిపారు. శ్రీశైలం వరకు నీళ్లు వచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం కండ్లు మూసుకొని ర్చుందని,మంత్రుల బృందం ఒకసారి వచ్చి చూడాలని, మహబూబ్ నగర్ హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో తెలంగాణ హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామని వివరించారు. ఆర్డీఎస్ వద్ద కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు తుంగభద్ర జలాల దోపిడీకి చేపట్టిన అక్రమ ప్రాజెక్టులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర నీటి వాటా కోల్పోతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైట్ కెనాల్ కట్టడానికి ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

# ఎన్నికలు ఎప్పుడైనా వార్ వన్ సైడే

- ఇప్పటి బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారు
- పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోంది
- జోగులాంబ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజానావ, జోగులాంబ గద్వాల : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికల వచ్చినా వార్ వన్ సైడేనని మళ్ళీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి రాష్ట్రంలో జరిగిన అన్నిఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు, ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు అందించారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో జరిగిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారికి ఆత్మీయ చిరు కానుకలను అందించడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. గద్వాల జిల్లా ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. పేదల ఆత్మ గౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు. దశాబ్దాల పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వంలో సాకారం చేస్తోంది. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలైతే అయితే చాలు ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జూరాల, నెట్టంపాడు ముంపు భూనిర్వాసితులకు డ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం. రెవెన్యూ శాఖ పరిధిలోని గద్వాల జిల్లా కావాల్సిన ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను డా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం.పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ప్రజాప్రభుత్వం అని మంత్రి తెలిపారు.

# గురుకుల విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై అప్రమత్తం

- వర్షాకాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- పారదర్శక అడ్మిషన్ల పక్రియ నిర్వహించాలి
- నాణ్యమైన బోధనకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు, వేడి నీరు, పారిశుధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షాకాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... గురుకులాల్లో ప్రవేశాల పక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు టాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో నిబంధనల ప్రకారం తాత్కాలిక నియామకాలు చేపట్టి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుందని, ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళిక అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన వేడి నీరు అందుబాటులో ఉంచాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నీటి ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. నీటి నాణ్యతను పరీక్షించి, అవసరమైన చోట వాటర్ ప్యూర్గి÷యైర్లు, క్లోరినేషన్, ఫిల్టరేషన్ సదుపాయాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. బాలికల గురుకులాలు, హాస్టళ్లలో మరింత అప్రమత్తత అవసరమని మంత్రి పేర్కొన్నారు. టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు ప్రతిరోజూ శుభ్రంగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సానిటరీ న్యాప్‌కిన్ల అందుబాటు, డిస్పోజల్ యూనిట్లు, మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, అవసరమైన చోట మహిళా కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి గురుకులం లో ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని మంత్రి తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య ంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు నిరంతర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, చర్మవ్యాధులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే చికిత్సకు పంపే విధంగా ఆరోగ్య ప్రోటోకాల్ అమలు చేయాలని సూచించారు. వంటశాలలు, డైనింగ్ హాళ్లు, నిల్వ గదుల పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. నాణ్యమైన రగాయలు, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల సరఫరా నిరంతరంగా జరిగేలా పర్యవేక్షించాలని, నిల్వ ఆహార పదార్థాల నాణ్యతను తరచుగా తనిఖీ చేయాలని చెప్పారు. విద్యార్థులకు పౌష్టికాహారం, సురక్షితమైన వసతి, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడం సంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను దశల వారీగా విస్తరించేందుకు ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, ఉన్నత విద్యా అవకాశాలు మరింత చేరువయ్యేలా సీఓఈల విస్తరణ కు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల వేతనాలు ప్రతి నెలా ఒకటో తేదీన జమయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వేతనాల విడుదలలో జాప్యం లేకుండా ఆర్థిక, పరిపాలనా పక్రియలను ముందుగానే పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ సంతోష్ ,తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంస్థ కార్యదర్శికంభంపాటి శారద, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అదనపు కార్యదర్శి నటరాజ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పది రూపాయల నాణేలతో బైక్ కొనుగోలు

**బైక్ కోసం లక్షా పదివేల మొత్తం చెల్లింపు**

ప్రజానావ, నల్లగొండ : కొంత మంది తాము చేసే పని వినూత్నంగా ఉండాలని భావిస్తారు. అలా చేయడంతో వారి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. తాజాగా బైక్ కొనుగోలు చేయడానికి ఎంచుకున్న మార్గంతో ఓ వ్యక్తి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండే రఘుపతి బైక్ కొనుగోలు చేశారు. అందుకు అవసరమైన రూ.1.10 లక్షల మొత్తాన్ని రూ.10 నాణెళిల రూపంలో చెల్లించారు. ఈ బైక్ కొనడం కోసం చాలా కాలంగా ఆయన రూ.10 నాణెళిలను పొదుపు చేస్తూ వచ్చారు. అలా దాచిన నగదును అంతా కవర్లలో నింపుకుని బైక్ షోరూమ్‌కు వెళ్లారు. ఈ నగదు చెల్లించి తనకు ఇష్టమైన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను ఆయన కొనుగోలు చేశారు. షోరూమ్‌లోని సిబ్బంది అంతా కలిసి ఈ నగదును లెక్కించారు. నగదు లెక్కించడానికి కొన్ని గంటల సమయం పట్టింది. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు స్పందించారు. కొండే రఘుపతి పొదుపుతోపాటు పట్టుదలను వారు అభినందించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో
పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు,
నియోజకవర్గ కేంద్రాలు,
మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో
పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు
కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169



# కాళేశ్వరం కథ కంచికి చేరేదెలా?

EDITORIAL

నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచార ణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు.

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు. అందు వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం సీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం సీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పడ ని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ వలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్ధంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగించుకునే శక్తి ఉంటుం దా లేదన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరుపయోగం గా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్దిని చాటుకోవాలి. కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా లిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నా రు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షిఁచడం డా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటి ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. సీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడదదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అను గుణంగా ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు. నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లా యో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యమయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ అబద్దాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.

నిధులు ఎక్కడ దారి మళ్లా యో గుర్తించా లి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందిం చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యమయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవు తాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించ లేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయ లేకపోయింది.

## తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- కలెక్టర్ చంద్రశేఖర్
- పైపులైన్ లీకేజీల మరమ్మతులు, రిజర్వాయర్ల భద్రతపై ప్రత్యేక దృష్టి

**ప్రజానావ, నల్లగొండ:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నీటిపారుదల, ప్రజారోగ్య, మున్సిపల్ శాఖల ఇంజినీర్లతో నిర్వహించిన తాగునీటి సరఫరా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్ణీత సమయాలకు నీటిని సరఫరా చేసి ఆ వివరాలను కాలనీవాసులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. పైపులైన్లలో లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి వృథాను నివారించాలని ఆదేశించారు. రిజర్వాయర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టాలని, అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి పానగల్లు ఉదయ సముద్రానికి నీటిని విడుదల చేయాలని సూచించారు. లైనింగ్ పనులు చేపట్టే సమయంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్ రెడ్డి, ఆర్డీఓ అశోక్ రెడ్డి, ఈఈ నెహ్రూనాయక్, ఎస్ఈ నాగేశ్వరరావు, జాన్ నాయక్, మున్సిపల్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచే వరకు పోరాటం కొనసాగుతుంది

- వనపర్తి ఎంసీహెచ్, మెడికల్ కళాశాల ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల నిరసన
- కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ఏజెన్సీ వ్యవస్థ రద్దు చేయాలని డిమాండ్




**ప్రజానావ, వనపర్తి:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆసుపత్రి శాఖ నాయకులు గంధం శ్రీనివాస్, నరేందర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని ఎంసీహెచ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, ఒక నెల వేతనానికి సమానంగా బోనస్ ఇవ్వాలని, జాతీయ పండుగలు, ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఏజెన్సీ గడువు ముగిసి ఏడాది దాటినా కొత్త విధానం అమలు చేయకపోవడంతో వేతనాలు పెరగకపోగా పనిభారం మరింత పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే అనేక దఫాలుగా ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించలేదని, అందుకే హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి శాఖ నాయకులు లింగంశెట్టి, కుమార్, మోహన్, అనిల్, శ్రీహరి, వెంకటేష్, మహేష్, ప్రవీణ్, రవి, భానుప్రకాశ్, రవికిషోర్, లక్ష్మి, పెంటమ్మ, భాగ్యమ్మ, రహేల, శాంత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో వర్గపోరు.. అర్వపల్లిలో ఉద్రిక్తత

- ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేల్ వర్గీయుల మధ్య ఘర్షణ
- రాళ్లు, కర్రలతో పరస్పర దాడులు.. పలువురికి గాయాలు
- అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపైనా దాడి



**ప్రజానావ, నల్లగొండ:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గీయుల మధ్య అర్వపల్లి మండల కేంద్రంలో తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. తుంగతుర్తి కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎంపిక వ్యవహారమే ఈ వివాదానికి దారితీసింది. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఏకపక్షంగా పార్టీ మండల అధ్యక్షుడిని ఎంపిక చేశారని, పార్టీ నాయకులకు సమాచారం ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడి ఎంపికను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సామేల్ వర్గీయులు అర్వపల్లి మండల కేంద్రంలో వారి వాహనాలను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారి రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనతో అర్వపల్లి జంక్షన్ రణరంగాన్ని తలపించింది. రాళ్ల దాడిలో పలు కార్లు, ఇతర వాహనాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘర్షణలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు పోలీసు సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఫిల్టర్ ఇసుక అక్రమాలపై కఠిన నిఘా

**ప్రజానావ, సంగారెడ్డి:** జిల్లాలో ఫిల్టర్ ఇసుక కార్యకలాపాలు ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలు, భూగర్భ జలాల సంరక్షణకు సంబంధించిన చట్టాలకు అనుగుణంగానే నిర్వహించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించా రు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మంది రంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో ఫిల్టర్ ఇసుక యూనిట్లపై నిరంతరం తనిఖీలు నిర్వహించి సంబంధిత అనుమతులు, నిబంధనలు కచ్చితంగా అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అనుమతులు లేని ఫిల్టర్ ఇసుక యూనిట్లు, అక్రమ ఇసుక నిల్వలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కార్యకలాపాలను అడ్డుకోవాలని, సంబంధిత వాహనాలను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, సంగారెడ్డి, జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలను పంట పొలాలకు మళ్లించాలి

- ఎంపీ వద్దిరాజు
- కాళేశ్వరం ద్వారా రిజర్వాయర్లను నింపాలి

**ప్రజానావ, ఖమ్మం:** గోదావరి నదిలో ప్రవహిస్తున్న వరద జలాలు సముద్రంలో కలిసిపోకుండా వాటిని సాగునీటి అవసరాలకు వినియోగించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం పెరిగిందని, ఈ నీటిని సద్వినియోగం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, మేడిగడ్డ వద్ద ప్రస్తుతం భారీగా వరద ప్రవాహం కొనసాగుతోందని తెలిపారు. ఈ నీటిని వృథాగా సముద్రంలోకి వదిలేయకుండా కన్నేపల్లి పంపుల ద్వారా అన్నారం, సుందిళ్ల, రంగనాయక సాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లను నింపాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది కరువు పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నప్పటికీ గోదావరి జలాలను ఎత్తిపోసి వినియోగించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. కాళేశ్వరం బహుళ దశల సాగునీటి పథకం ద్వారా గతంలో రాష్ట్రంలోని విస్తారమైన సాగుభూములకు నీరు అందించగలిగామని, ప్రస్తుతం ఆ అవకాశాన్ని ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, గోదావరి జలాలను వ్యవసాయ అవసరాలకు మళ్లించి రాష్ట్రాన్ని కరువు బారిన పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.

## గురుకులాల్లో కామన్ డైట్ మెనూ తప్పనిసరి

- విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని కలెక్టర్ హైమావతి ఆదేశం
- వంటశాలలు, డైనింగ్ హాల్స్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన



**ప్రజానావ, సిద్ధిపేట:** జిల్లాలోని అన్ని గురుకుల విద్యాసంస్థల్లో కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల యాజమాన్యాలను ఆదేశించారు. బుధవారం సిద్ధిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించిన అన్నం, వెజిటేబుల్ బిర్యానీ, ఆలుగడ్డ–టమాట కూర, ఫ్రైడ్ ఎగ్ కూర, సాంబారు, పెరుగును పరిశీలించిన కలెక్టర్, వెజిటేబుల్ బిర్యానీ నాణ్యత బాగుందని అభినందించారు. రోజువారీగా కామన్ డైట్ మెనూను పాటిస్తున్నారా, ప్రతి వంటకం నాణ్యత, రుచి ప్రమాణాలకు అనుగుణంగా ఉందా అనే అంశాలపై అధికారులను ఆరా తీశారు. విద్యార్థుల హాజరు ఆధారంగా కూరగాయలు, ఇతర వంట సామగ్రిని నిర్ణీత కొలతల ప్రకారం వినియోగించాలని సూచించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజన తయారీ, వడ్డింపు ప్రక్రియలను ప్రిన్సిపాల్ లేదా ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. వంటగది, డైనింగ్ హాల్‌తో పాటు గురుకుల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు నిల్వ లేకుండా, దోమలు, ఈగలు నివారించే చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు కలెక్టర్ హైమావతి ఆదేశించారు.

## సురవరం ప్రతాప్ ప్రెస్ క్లబ్‌కు మంత్రి పొంగులేటి గ్రీన్‌సిగ్నల్

- రెండు రోజుల్లో ప్రొసీడింగ్స్ పత్రం అందిస్తామని మంత్రి హామీ
- ఆధునిక సౌకర్యాలతో ప్రెస్ క్లబ్ భవనం మంజూరు చేయాలని జర్నలిస్టుల వినతి

**ప్రజానావ, వనపర్తి:** వనపర్తి జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన సురవరం ప్రతాప్ ప్రెస్ క్లబ్ భవనాన్ని మంజూరు చేయాలని జిల్లా జర్నలిస్టులు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కోరారు. కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు శాశ్వత వేదికగా ఉపయోగపడే విధంగా అన్ని వసతులతో కూడిన ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సొంత భవనం లేక సమావేశాలు, మీడియా కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ఆధునిక ప్రెస్ క్లబ్ అవసరమని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, రెండు రోజుల్లో ప్రెస్ క్లబ్ మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ పత్రాన్ని అందించేలా అధికారులను ఆదేశించారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.






## ఆపరేషన్ ముస్కాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి

- బాల కార్మికత్వ నిర్మూలనకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు
- హోటళ్లు, వాణిజ్య సంస్థల్లో బాల కార్మికులను నియమించబోమని బోర్డులు ఏర్పాటు చేయాలి

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** జిల్లాలో బాల కార్మికత్వ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని హోటళ్లు, వాణిజ్య సంస్థలు, దుకాణాల వద్ద **మా వద్ద 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో నియమించము అనే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. బాల కార్మికత్వం, బాలల అక్రమ రవాణా, బాలలపై దోపిడీ నిర్మూలనకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్షించిన బాలలకు సంరక్షణ, పునరావాసం కల్పించేందుకు ప్రత్యేక షెల్టర్ హోమ్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

- తుంబూరు దయాకర్‌రెడ్డి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో 75 మందికి చెక్కుల పంపిణీ
- రూ.27 లక్షల ఆర్థిక సాయం అందజేత

**ప్రజానావ, ఖమ్మం:** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సిఫారసుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 75 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులు పంపిణీ చేశారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు రూ.27 లక్షల విలువైన ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు వరంలా మారిందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక మంది నిరుపేదలకు వైద్య, ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# తాడిచర్ల బ్లాక్‌తో సింగరేణికి ఊతం

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సింగరేణికి భారీ ప్రయోజనాలు కలుగనున్నాయని వెల్లడి
- వేలాది ఉద్యోగాలతో పాటు రాష్ట్రానికి భారీ ఆదాయం వస్తుందని వ్యాఖ్య
- కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించిన వారు కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

**ప్రజానావ, రామగుండం:** తాడిచర్ల బొగ్గు బ్లాక్ ఫేజ్–2ను సింగరేణి సంస్థకు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారికి ఇది గట్టి సమాధానమని బీఎంఎస్ సింగరేణి కోల్ మైన్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి పేర్కొన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణికి కొత్త బొగ్గు గని రావడం ప్రస్తుత పరిస్థితుల్లో శుభపరిణామమని వారు అన్నారు. తాడిచర్ల బొగ్గు బ్లాక్ ద్వారా సుమారు 600 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశముందని, దాని ద్వారా సుమారు రూ.64 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.1,500 కోట్ల ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే 1,200 మంది శాశ్వత కార్మికులకు, 15 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడిం చారు. ఈ బొగ్గు బ్లాక్‌తో కోల్ కారిడార్ అభివృద్ధి చెందడంతో మంథనితో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని చెప్పారు. గత పదేళ్లలో బొగ్గు బ్లాకుల వేలంపాటల్లో పాల్గొనకపోవడం వల్ల సింగరేణికి అనేక బొగ్గు బ్లాకులు దక్కకుండా చేశారని బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకత్వంపై విమర్శలు గుప్పిం చారు. ఇప్పుడు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో కొత్త బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కిందని పేర్కొన్నారు. కాషాయ దళంపై విమర్శలు చేసిన టీబీజీకేఎస్ నాయకులు, సింగరేణికి బొగ్గు బ్లాకులు రాకుండా చేసినందుకు కార్మిక వర్గానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించిన 12వ వేజ్ బోర్డు అంశంపై కూడా కేంద్ర బొగ్గు శాఖ మంత్రితో చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే వేజ్ బోర్డు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఎంఎస్ సీనియర్ ఉపాధ్యక్షుడు సారంగపాణి, నాయకులు గాలిపెల్లి తిరుపతి, అరుకాల ప్రసాద్, సతీష్, గుండబోయిన భూమయ్య, లక్ష్మణ్, సాంబయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

Singareni news

# మారుపేర్ల బాధితుల సమస్య పరిష్కారానికి కీలక అడుగు

- సమస్యపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేసిన సింగరేణి యాజమాన్యం
- త్వరలో న్యాయసమ్మత పరిష్కారం
- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా జనక్ ప్రసాద్



**ప్రజానావ, రామగుండం:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సింగరేణి మారుపేర్ల బాధితుల సమస్య పరిష్కారానికి కీలక చర్యలు ప్రారంభమ య్యాయ ని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ డా. జనక్ ప్రసాద్ తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేయడంతో పాటు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిరంతరం కృషి చేసిన ఫలితంగానే పరిష్కార దిశగా ముందడుగు పడిందన్నారు. గత నెల శ్రీరాంపూర్‌లో నిర్వహిం చిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన మేరకు మారుపేర్ల బాధితుల సమస్యను అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సూచించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఐఎన్‌టీయూసీ నుంచి ఒక ప్రతినిధి, ఏఐటీయూసీ నుంచి ఒక ప్రతినిధి, ఒక న్యాయ నిపుణుడు, ఒక సింగరేణి అధికారి సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న మారుపేర్ల బాధితులకు త్వరలోనే న్యాయసమ్మ తమైన పరిష్కారం లభిస్తుందని డా. జనక్ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి కార్మికుల తరఫున, ఐఎన్‌టీయూసీ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




# డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి

- డిగ్రీ విద్యార్థుల అవగాహన సదస్సులో సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

**ప్రజానావ, సిరిసిల్ల :** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సిరిసిల్ల డిఎస్పి కె నాగేంద్ర చారి పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జిల్లా డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

- ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అధికారులను కలవడం ప్రజాప్రతినిధిగా రాజ్యాంగబద్ధమైన హక్కే




**ప్రజానావ, స్టేషన్ ఘనపూర్:** ప్రజల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికారులను కలుస్తానని, తాను ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా స్టేషన్ ఘనపూర్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం రైతు భరోసా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసిన అంశంపై జరుగుతున్న ప్రచారానికి స్పందించారు. ప్రజా ప్రతినిధిగా తన నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏ అధికారినైనా కలిసే హక్కు తనకు ఉందన్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నిధుల మంజూరు వంటి అంశాలపై చర్చించేందుకే దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిశానని, ఆలయ కమిటీ చైర్మన్లతో కలిసి పలు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. తాను చేసిన పనిలో ఎలాంటి తప్పు లేనప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిన ఆయన, ఈ అంశాన్ని అనవసరంగా వివాదాస్పదం చేస్తూ ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వ్యవహారాలపై పూర్తి అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి ఆరోపణలు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ బిజినెస్ రూల్స్, రాజ్యాంగ నిబంధనల ప్రకారం క్యాబినెట్ హోదా కలిగిన మంత్రులు మాత్రమే అధికారిక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారని, అయితే ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులను వ్యక్తిగతంగా కలవడం ప్రజాప్రతినిధుల బాధ్యతలో భాగమేనని వివరించారు. ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని కడియం శ్రీహరి విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించడం, ఎంజీఎం ఆసుపత్రికి శాశ్వత సూపరింటెండెంట్ నియామకం, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. తాగునీరు, సాగునీరు, వైద్య సేవలు, రహదారులు, ఆలయాల అభివృద్ధి వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత విమర్శలు, రాజకీయ వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. తన రాజకీయ జీవితం మొత్తం ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధికే అంకితమైందని, భవిష్యత్తులో కూడా అదే దిశగా కొనసాగుతానని స్పష్టం చేశారు.

# 24 గంటల్లో కిడ్నాప్ కేసు ఛేదన

- ఆరేళ్ల చిన్నారి సురక్షితం
- మహారాష్ట్రకు తరలించి విక్రయించేందుకు యత్నించిన నిందితుడి అరెస్ట్
- చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచన




**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా మద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఆరేళ్ల బాలిక కిడ్నాప్ కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి చిన్నారిని సురక్షితంగా రక్షించారు. బాలికను మహారాష్ట్రకు తరలించి విక్రయించేందుకు ప్రయత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. పోలీసుల వివరాల ప్రకారం, బాలిక తల్లి నిజామాబాద్‌కు వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఉన్న చిన్నారిని కుటుంబానికి పరిచయస్తుడైన వ్యక్తి మోసపూరితంగా తీసుకెళ్లాడు. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. బాన్సువాడ డీఎస్పీ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని విశ్లేషిస్తూ గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు బాలికను ఆటోలో మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు తీసుకెళ్లి కొత్త దుస్తులు, గాజులు కొనిచ్చినట్లు గుర్తించారు. అనంతరం నాందేడ్, ఔరంగాబాద్ ప్రాంతాల్లో బాలికను విక్రయించేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమై తిరిగి దెగ్లూర్‌కు వచ్చినట్లు విచారణలో తేలింది. దెగ్లూర్‌లో బాలికతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం బాలికను అపహరించి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు అంగీకరించినట్లు వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి రైలు టికెట్, బాలిక పాత దుస్తులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రక్షించిన బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు, తాడిహిప్పర్గ గ్రామానికి చెందిన హర్నే రాజేందర్ (42)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో చిన్నారులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100కు సమాచారం అందించాలని కోరారు. చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానంతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసును 24 గంటల్లో ఛేదించి చిన్నారిని సురక్షితంగా రక్షించిన మద్నూర్ పోలీస్ స్టేషన్ అధికారులు, ప్రత్యేక దర్యాప్తు బృందం, సాంకేతిక బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# ఎన్పీడీసీఎల్ సేవలు పారదర్శకంగా ఉండాలి

**విద్యుత్ యంత్రణ మండలి చైర్మన్‌కు సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి వినతి**

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) నిర్వహణను ఎన్పీడీసీఎల్ చేపట్టిన సందర్భంలో వినియోగదారులకు విద్యుత్ మీటర్లు అందడం లేదని, మీటర్ల స్టాకు లేదని ఏఈ నుండి సమాధానాలు వస్తున్నాయని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షులు బియ్యం కార్ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ కు పౌర సంక్షేమ సమితి పక్షాన వినతిపత్రం సమర్పిస్తూ విద్యుత్ మీటర్లు ట్రాన్స్‌ఫార్మర్ల స్టాకుల వివరాలు నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్నారు. మీటర్ల స్టాకులు ఉన్నప్పటికీ వినియోగదారులకు విద్యుత్ మీటర్లు దొరకడం లేదని, ఎస్సీ వద్దకు పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్లు లభ్యం గాక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలిపారు. అందుకే ప్రతి కార్యాలయంలో, మండల కార్యాలయంలో స్టాకు బోర్డులు ప్రదర్శించాలన్నారు. స్టాక్ బోర్డుల నిబంధనను అమ లులోకి తీసుకురావాలని దీనిపై వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షులు ప్రియాంక శ్రీనివాస్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండల చైర్మన్‌ను కోరారు. ఈ కార్యక్ర మంలో ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కుసుమ గణేష్, సభ్యులు మడికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు సకాలంలో అందజేయాలి

**ఆర్డీఓ జగదీశ్వర్**

**ప్రజానావ, ఆదిలాబాద్ :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టి న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను గడువులోపు విజయవంతంగా పూర్తి చేసేందుకు ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూరించి సంబంధిత బీఎల్ఓలకు సకాలంలో అందజేయా లని ఆదిలాబాద్ ఆర్డీఓ జగదీశ్వర్ సూచించారు. నిర్దేశిత గడువులోపు ఫారాలు సమర్పించకపోతే ఓటు జాబితా నుంచి పేరు తొలగిపోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణం లోని 45వ వార్డులో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు, బీఎల్‌ఓలు ఫారాలు పూరింపజేస్తున్న తీరును పరిశీలించి, ఓటర్లకు ఫారాలు ఎలా భర్తీ చేయాలనే విషయంపై సూచనలు చేశారు. ప్రజలు ఫారాలను స్వీకరించి సకాలంలో పూర్తి చేసి బీఎల్‌ఓలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జగదీశ్వర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు అత్యంత విలువ ఉందన్నారు. మహారాష్ట్రకు చెందిన వారైనా 2002 ఓటరు జాబితా ఆధారంగా అర్హులైన వారు ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి సమర్పిం చాలని సూచించారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా బీఎల్‌ఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఓటర్లు కూడా బాధ్యతగా వ్యవహరించి ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోపు పూరించి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ ఉజ్వేందర్, సూపర్‌వైజర్ శశికళ, బీఎల్‌ఓలు ఆశ, ప్రేమలత, బీఎల్‌ఏలు సుగత్, రిజ్వాన్, కాంగ్రెస్ నాయకుడు బండారి సతీష్ పాల్గొన్నారు.

# వర్షాకాల నేపథ్యంలో సంసిద్ధంగా..

- జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందం
- అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బీ. గితే



**ప్రజానావ, సిరిసిల్ల :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదలు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ఆర్.ఐ ఆధ్వర్యంలో 12 మంది సభ్యులతో కూడిన జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) బృందం పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. బుధవారం వేములవాడ పట్టణ పరిధిలోని నాంపెల్లి గ్రామ చెరువులో భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సభ్యులతో కలిసి రెస్క్యూ బోటులో ప్రయాణించి, సహాయక చర్యల నిర్వహణను పరిశీలించారు. అనంతరం డిఆర్ఎఫ్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను రక్షించేలా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జిల్లా పోలీసులతో పాటు జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం కూడా తక్షణమే సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. జిల్లా డిఆర్ఎఫ్ బృందం వద్ద రెస్క్యూ బోటు, మోటార్, మెడికల్ స్ట్రెచర్, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, వుడ్ కట్టర్ యంత్రాలు తదితర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం, డిఆర్ఎఫ్ బృందం 24×7 అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఎవరైనా ఆపదలో ఉన్నట్లు గమనించినా లేదా సహాయం అవసరమైనా వెంటనే స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. గత ఏడాది వర్షాకాలంలో వరదల సమయంలో, అలాగే గణేష్ నిమజ్జనాల సందర్భంగా వివిధ అత్యవసర పరిస్థితుల్లో జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది సమయోచితంగా స్పందించి ప్రజలకు అందించిన సేవలను అభినందించారు. అదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా అప్రమత్తంగా ఉంటూ ప్రతి అత్యవసర పరిస్థితిలో వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసులు, సిఐ వీరప్రసాద్, ఆర్ఐ అడ్మిన్ సురేష్, ఆర్ఎస్ఐ లు సాయి కిరణ్, శ్రావణ్ యాదవ్, డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయం

- పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ కృషి
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**ప్రజానావ, పెద్దపల్లి :** జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద, సుల్తానాబాద్ మున్సిపల్ మొదటి వార్డు సుగ్లాంపల్లిలో దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుకల్పించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు గారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, ఔటర్ రింగు రోడ్డు, రాజీవ్ రహదారి, ఇంకా మరెన్నో సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకొచ్చి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిలో నిలిచిపోయారని ఇవి కేవలం పథకాలు, అభివృద్ధి పనులు మాత్రమే కాదని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి దూరదృష్టికి, ప్రజా సంక్షేమ పాలనకు చిరస్మరణీయ చిహ్నాలని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహానేతకు నా ఘన నివాళులు తెలుపుతూ ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహార పథకం ఎంతో మేలు

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి**



**ప్రజానావ, హనుమకొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహార పథకం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి గొప్ప వరమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా దామెరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్‌తో కలిసి అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి వారి ఆరోగ్యం, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన బోధన అందు బాటులో ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీ ల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంఈవో జుమ్మునాయక్, సర్పంచి కల్పన, ఏవో రాకేష్, ప్రధానోపాధ్యాయులు రాజేష్ కుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీ కోచ్‌లో అలంకరణ కలకలం

- నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌లో అనుమతి లేకుండా డెకరేటర్ ప్రవేశం
- వైరల్ వీడియోతో టీటీఈ సస్పెన్షన్
- శాఖాపరమైన విచారణకు రైల్వే ఆదేశం

**న్యూఢిల్లీ:** నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌లోని ఫస్ట్ ఏసీ కూపేను పూలతో అలంకరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రైల్వే శాఖ కఠిన చర్యలకు దిగింది. ఈ ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించి సంబంధిత ట్రైన్ టికెట్ ఎగ్జామినర్ (టిటీఈ)ను సస్పెండ్ చేసింది. అలాగే ఘటనపై సమగ్ర శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరిగిన ఈ ఘటన జూలై 6న నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ (రైలు నం.11002)లో చోటుచేసుకుంది. ప్రయాణిస్తున్న ఓ దంపతులు ప్రైవేట్ ఆన్‌లైన్ డెకరేషన్ సేవలను వినియోగించి తమ ఫస్ట్ ఏసీ కూపేను అలంకరించుకున్నారు. అయితే డెకరేటర్‌కు రైల్వే నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే కోచ్‌లోకి ప్రవేశం కల్పించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనను భద్రతా నిబంధనల ఉల్లంఘనగా పరిగణించిన రైల్వే శాఖ సంబంధిత టిటీఈపై సస్పెన్షన్ వేటు వేసింది. పూర్తి స్థాయి శాఖాపరమైన విచారణ అనంతరం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# నీట్ పేపర్ లీక్ కేసులో నిందితులకు కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్–యూజీ ప్రశ్నపత్రం లీక్ కేసులో ఇద్దరు కీలక నిందితుల జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ ప్రత్యేక కోర్టు జూలై 11 వరకు పొడిగించింది. కేసులో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పి.వి. కులకర్ణితో పాటు రెనుకై కెరీర్ సెంటర్ వ్యవస్థాపకు డు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్‌ను బుధవారం ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా ఎదుట హాజరు పరిచారు. సీబీఐ అభ్యర్థన మేరకు కోర్టు కస్టడీని పొడిగించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన రసాయన శాస్త్ర నిపుణుడు కులకర్ణి గతంలో నీట్ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా పనిచే శారు. గత నెల పుణెలో ఆయనను సీబీఐ అరెస్టు చేసింది. మరో నిందితుడు మోటేగావ్‌కర్‌ను మే నెలలో లాతూర్‌లో అదుపులోకి తీసుకోగా, ఆయన మొబైల్ ఫోన్‌లో మే 3న నిర్వహించిన నీట్–యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లభించినట్లు సీబీఐ వెల్లడించింది. తన కోచింగ్ సెంటర్ ద్వారా ప్రశ్నపత్రం, సమాధానా లను ప్రచారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 13 మందిని సీబీఐ అరెస్టు చేయగా, వారంతా ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

# ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా

- హర్మూజ్ ఉద్రిక్తతలతో మరో విడత వైమానిక దాడులు
- వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతీకార చర్యలంటూ వెల్లడించిన వాషింగ్టన్
- గగనతల రక్షణ వ్యవస్థలు, రివల్యూషనరీ గార్డ్ స్థావరాలే లక్ష్యమని ప్రకటన



**దుబాయ్:** అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తత లు మరోసారి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నా యి. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతీకారంగా బుధవారం రాత్రి మరో విడత వైమానిక దాడులు నిర్వహించినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. అంతకుముందు ఇరాన్ చర్యలతో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసినట్లే నని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానిం చడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అయితే పూర్తి స్థాయి యుద్ధం కొనసాగదని, దౌత్య చర్చలకు అవకాశం ఇస్తామని ట్రంప్ మరోవైపు స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిపినందుకు ప్రతిస్పందనగా ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్‌కు చెందిన గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, రివల్యూషనరీ గార్డ్ వినియోగించే 60కుపైగా వేగవంతమైన పడవలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు వెల్లడించింది.

## అవసరమైతే పని పూర్తిచేస్తాం

నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్, అవసరమైతే ఇరాన్‌పై మరింత తీవ్రంగా దాడులు చేస్తామని హెచ్చరించారు. 'ఏం జరగాల్సి వచ్చినా చాలా వేగంగా జరుగుతుంది. అవసరమైతే పని పూర్తిచేస్తాం' అంటూ వ్యాఖ్యానించారు. గతంలో మాదిరిగానే ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, డీశాలినేషన్ ప్లాంట్లు, కీలక చమురు ఎగుమతి కేంద్రం ఖార్గ్ దీవిని కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశాన్ని ఆయన ప్రస్తావించారు. ఇరాన్ తాజా చర్యలతో తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం దాదాపు ముగిసినట్లేనని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ అమెరికా ప్రతినిధులు ఇరాన్‌తో చర్చలు కొనసాగిస్తారని, అయితే వాటి ఫలితాలపై తనకు పెద్దగా ఆశలు లేవని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెం ఘరీబాబాదీ ట్రంప్ వ్యాఖ్యలను అమెరికా విధాన వైఫల్యానికి నిదర్శనంగా అభివర్ణించారు. అయితే హర్మూజ్ జలసంధిలో నౌకాయాన నియంత్ర ణ తమ హక్కేనని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఖాలిబాఫ్ కూడా బెదిరింపులకు తాము తలొగ్గబోమని, ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని ప్రకటించారు.

## ఇరాన్‌లో పేలుళ్లు.. సైనికుల మృతి

అమెరికా దాడుల అనంతరం బందర్ మహ్‌షహర్, బందర్ అబ్బాస్, బుషెహర్ తదితర ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. రివల్యూషనరీ గార్డ్‌కు చెందిన ఒక సభ్యుడు, ఇరాన్ వైమానిక, నౌకాదళాలకు చెందిన ఎనిమిది మంది సైనికులు మృతిచెందినట్లు తెలిపింది. బుషెహర్‌లో ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉండటం గమనార్హం. ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా ఐదో నౌకాదళం ఉన్న బహ్రెయిన్, అమెరికా సైనిక స్థావరాలు ఉన్న కువైట్‌లో క్షిపణి హెచ్చరికలు జారీ చేశారు. ప్రాంతమంతా అప్రమత్త పరిస్థితులు కొనసాగుతుండగా, ఇరాన్–అమెరికా మధ్య చర్చలు ఫలిస్తాయా లేదా అన్న దానిపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# అవినాశ్ శుక్లా ప్రధాన సూత్రధారి

- రామాలయ విరాళాల అక్రమాలపై బిగుస్తున్న ఉచ్చు
- విరాళాల లెక్కింపులో అక్రమాలకు పాల్పడింది ఎనిమిది మందే: సిట్
- 40 రోజులుగా విరాళాల సొమ్ము మళ్లింపుపై సంచలన వివరాలు
- ట్రస్టు సిఫారసుతోనే దర్యాప్తు
- నకిలీ రసీదులు, సీసీటీవీ ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం
- విపక్షాల విమర్శలు
- మొత్తం ట్రస్టును తప్పుబట్టొద్దన్న సీఎం యోగి
- రాజకీయ రంగు పులుముతున్నారంటూ ఎదురుదాడి



**అయోధ్య/చిత్రకూట్ :** అయోధ్య శ్రీరామ జన్మ భూమి ఆలయంలో భక్తుల విరాళాల అక్రమాల కేసు దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్‌ఐటీ) ప్రాథమిక విచారణలో అవినాశ్ శుక్లాను ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారిగా గుర్తించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దాదాపు 40 రోజుల వ్యవధిలో సుమారు 70 సంద ర్భాల్లో విరాళాల నగదు మళ్లింపునకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ఘటనను ఆసరాగా చేసుకుని మొత్తం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ప్రతిష్ఠను దెబ్బతీయడం తగదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ఇదిలాఉంటే విరాళాల లెక్కింపులో విధులు నిర్వహించిన అవినాశ్ శుక్లా చుట్టూనే ఈ అక్రమాల వ్యవస్థ నడిచినట్లు ఎస్‌ఐటీ తొమ్మిది పేజీల ప్రాథమిక నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. సీసీటీవీ దృశ్యాల్లో నగదు కట్టలు, చిల్లరను దాచిపెట్టి బయటకు తరలిస్తున్న దృశ్యాలు నమోదైనట్లు అధికా రులు గుర్తించారు. అతడి ద్వారా మరో ఐదుగురు నిందితుల పాత్ర కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసులో నిందితులైన అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, కరుణేశ్ పాండేలను కోర్టు అనుమతితో పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తు న్నారు. విచారణ సందర్భంగా ట్రస్టు పాత విరాళాల రసీదులను పోలిన నకిలీ రసీదు పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ నకిలీ రసీదుల ద్వారా నే భక్తుల నుంచి నగదు వసూలు చేసి అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## తప్పు చేసింది ఎనిమిది మందే..

చిత్రకూట్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, విరాళాల లెక్కింపు లో పాల్గొన్న దాదాపు 150 మందిలో కేవలం ఎనిమి ది మందిపైనే స్పష్టమైన ఆధారాలు లభించాయని తెలిపారు. వారిలో ఆరుగురు ప్రత్యక్షంగా నగదు చోరీకి పాల్పడగా, మరో ఇద్దరు కుట్రలో భాగస్వా ములైనట్లు చెప్పారు. ట్రస్టు సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి ఎస్‌ఐటీని ఏర్పాటు చేసి విచారణ జరిపిందని, దర్యాప్తు నివేదిక ఆధారంగానే కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

## కీలక మార్పులు

దర్యాప్తు నేపథ్యంలో ట్రస్టు పరిపాలనలో పలు మార్పు లు చోటుచేసుకుంటున్నాయి. మాజీ ప్రధాన కార్యద ర్శి చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలను ట్రస్టు ఆమోదించింది. ట్రస్టు పరిపాలకుడు గోపాల్‌రావును బాధ్యతల నుంచి తప్పించడంతో పాటు ప్రత్యేక ఆహ్వానితుల జాబితా నుంచి కూడా తొలగించారు. ఆయన ఆలయ ప్రాంగణంలోని అధికార నివాసాన్ని ఖాళీ చేసి కార్‌సేవక్‌పురంకు మారారు. ఇదిలా ఉండగా ట్రస్టు ఖజానాదారు గోవింద్‌దేవ్ గిరి పలువురు ట్రస్టు సభ్యులు, అయోధ్య సాధువులతో సమావేశమై తాజా పరిణామాలపై చర్చించారు.

## రాజకీయ దుమారం

ఈ ఘటనను కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు రాజకీ య ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయ త్నం చేస్తున్నాయని యోగి ఆదిత్యనాథ్ ఆరోపిం చారు. అయోధ్య ప్రతిష్ఠను దెబ్బతీయడం, శ్రీరాముడి వారసత్వాన్ని అపకీర్తిపాలు చేయడమే వారి లక్ష్యమని విమర్శించారు. కొద్దిమంది చేసిన తప్పిదా లను మొత్తం ట్రస్టుకు ఆపాదించడం అన్యాయమ న్నారు. అయితే సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని విశ్వసించే భక్తులను తీవ్రంగా కలచివేసిం దని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ట్రస్టు సభ్యుల ఎంపికలో జరిగిన తప్పిదానికి ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ కోరారు. ఈ కేసులో ఇప్పటివరకు అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీశ్‌కు మార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. విరాళాల అక్రమాల వెనుక మరెవరైనా ఉన్నారా? నిధుల మళ్లింపు ఎంత మేర జరిగింది? అనే కోణాల్లో సిట్ లోతుగా దర్యాప్తు కొనసాగిస్తోంది.

# ఒకేసారి కవలలకు కాలేయ మార్పిడి

- 23 నెలల చిన్నారులకు విజయవంతంగా లివర్ ట్రాన్స్‌ప్లాంట్
- ఢిల్లీ వైద్యుల అరుదైన ఘనత
- తల్లి, మేనమామ అవయవ దానంతో ఇద్దరికీ కొత్త జీవితం

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆస్పత్రి వైద్యులు 23 నెలల వయసున్న ఫిలిప్పీన్స్‌కు చెందిన కవలలు టైలర్, కెల్లీలకు వరుసగా సజీవ దాతలతో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి అరుదైన ఘనత సాధించారు. ఆస్పత్రిలో ఇప్పటివరకు జరిగిన 645 చిన్నారుల లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌లలో కవలలకు ఒకేసారి మార్పిడి చేయడం ఇదే తొలిసారి. పుట్టిన రెండు వారాల్లోనే ఇద్దరికీ తీవ్రమైన కామెర్లు, తెల్లటి మలం వంటి లక్షణాలు కనిపించాయి. పరీక్షల్లో కొలెడోకల్ సిస్ట్ టైప్–4ఏ అనే అరుదైన జన్యుపరమైన వ్యాధి నిర్ధారణ కావడంతో కాలేయం తీవ్రంగా దెబ్బతింది. చివరకు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఒక్కటే మార్గమని వైద్యులు నిర్ణయించారు. ఒక చిన్నారికి తల్లి, మరో చిన్నారికి తల్లి సోదరుడు కాలేయ భాగాన్ని దానం చేశారు. డా.అనుపమ్ సిబల్, డా.నీరవ్ గోయల్ నేతృత్వంలోని బృందం వరుసగా 15 గంటలు, 13 గంటలపాటు శస్త్రచికిత్సలు నిర్వహించి విజయవం తంగా పూర్తి చేసింది. ప్రస్తుతం ఇద్దరు చిన్నారులు ఆరోగ్యంగా కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. ఈ విజయం భారత వైద్య నైపుణ్యానికి మరో అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచిందని ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది.



# ఎగ్మోర్ మహిళా ఆస్పత్రిలో సీఎం విజయ్ ఆకస్మిక తనిఖీ

- ప్రసూతి వార్డులను పరిశీలించిన తమిళనాడు ముఖ్యమంత్రి
- బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ఆరా
- వైద్య సేవలు, సౌకర్యాలపై అధికారులకు సూచనలు

**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ బుధవారం చెన్నైలోని ఎగ్మోర్ ప్రభుత్వ మహిళా, శిశు ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలోని ప్రసూతి, గైనకాలజీ విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ప్రసవానంతర సంరక్షణ వార్డును సందర్శించిన ముఖ్యమంత్రి బాలింతలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువులను ఆప్యాయంగా ఎత్తుకుని ముద్దాడుతూ తల్లులకు ధైర్యం చెప్పారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలను ముఖ్య మంత్రి పరిశీలించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు అధికారులు తెలిపారు.

# ఆస్ట్రేలియాలో మోదీకి ఘన స్వాగతం

- అల్బనీస్‌తో వార్షిక ద్వైపాక్షిక సదస్సు.. నేడు కీలక చర్చలు
- రక్షణ, వాణిజ్యం, విద్య, పెట్టుబడులపై భాగస్వామ్యానికి కొత్త ఊపు

**మెల్‌బోర్న్:** మూడుదేశాల విదేశీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు చేరుకున్నారు. విమా నాశ్రయంలో ఆస్ట్రేలియా ప్రభుత్వ ఉన్నతాధికారు లు ఆయనకు ఘన స్వాగతం పలకడంతో పాటు గౌరవ వందనం సమర్పించారు. ఈ పర్యటనతో భారత్–ఆస్ట్రేలియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వా మ్యానికి మరింత బలం చేకూరుతుందని మోదీ తెలిపారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో జరగనున్న సమావేశాలపై ఆసక్తిగా ఎదురుచూస్తు న్నట్లు పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా మోదీ, అల్బనీస్‌తో కలిసి మూడో వార్షిక భారత్–ఆస్ట్రేలి యా సదస్సుకు సహాధ్యక్షత వహించనున్నా రు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాం కేతికత, ప్రజల మధ్య సంబంధాల బలోపేతం పై విస్తృత చర్చలు జరగనున్నాయి. ద్వైపాక్షిక సహకా రాన్ని విస్తరించే అంశాలపై ఇరు దేశాలు దృష్టి సారించనున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.

## ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతం

మెల్‌బోర్న్‌లోని హోటల్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి భారతీయ ప్రవాసులు ఘన స్వాగతం పలికారు. మోదీ.. మోదీ, వందే మాతరం నినాదా లతో ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. మెల్‌బోర్న్ చలి వాతావరణంలోనూ భారతీయుల ప్రేమాభిమా నాలు హృదయాన్ని హత్తుకున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. భారతీయ ప్రవాసులు ఇరు దేశాల మధ్య బంధానికి కీలక వారధిగా నిలుస్తున్నా రని కొనియాడారు. స్వాగత కార్యక్రమంలో ఆస్ట్రేలియా ఆదివాసీల ప్రాచీన వాయిద్యమైన డిడ్జెరిడూ, భారతీ య తబలా సమ్మేళన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మా తుఝే సలామ్ ఆర్కెస్ట్రా ప్రదర్శనతో పాటు కథక్ నృత్యం మోదీని ఆకట్టుకున్నాయి. సంగీతం, నృత్యం ద్వారా రెండు దేశాల సాంస్కృతిక అనుబంధం మరింత బలపడుతోందన్నారు.

# ఉక్రెయిన్‌కు పేట్రియాట్ తయారీ హక్కులు

- అమెరికా సంచలన నిర్ణయం
- క్షిపణి రక్షణ వ్యవస్థలను స్వయంగా తయారు చేసుకునేందుకు అనుమతి
- నాటో సదస్సులో ట్రంప్ ప్రకటన
- ఉక్రెయిన్‌కు 80 బిలియన్ డాలర్ల రక్షణ సాయం ప్రకటించిన నాటో
- సిరియాపై ఉగ్రవాద దేశం ముద్ర తొలగింపునకు అమెరికా సిద్ధం




**అంకారా:** రష్యాతో నాలుగేళ్లకుపైగా కొనసాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు భారీ ఊరటనిచ్చే నిర్ణయాన్ని అమెరికా ప్రకటించింది. అత్యాధునిక 'పేట్రియాట్' క్షిపణి నిరోధక రక్షణ వ్యవస్థలను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేందుకు లైసెన్స్ మంజూరు చేయను న్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటిం చారు. టర్కియేలో జరిగిన నాటో శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ ప్రకటన చేశారు. ఇప్పటివరకు విదేశాల్లో పేట్రియాట్ వ్యవస్థల తయారీకి అమెరికా నిరాకరిస్తూ వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం ఉక్రెయిన్‌కు పెద్ద దౌత్య, వ్యూహాత్మక విజయంగా భావిస్తున్నారు.

## 'మీరే తయారు చేసుకోండి'

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీతో సమావేశమైన ట్రంప్, పేట్రియాట్ వ్యవస్థలను ఎలా తయారు చేయాలో ఉక్రెయిన్‌కు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తాం. వాటిని స్వయంగా తయారు చేసుకునే హక్కు కల్పిస్తాం అని ప్రకటించారు. రష్యా క్షిపణి, డ్రోన్ దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ వ్యవస్థలు అత్యంత కీలకమని, ఉక్రెయిన్ వాటిని త్వరగా ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో పలుమార్లు విభేదాలు వ్యక్తం చేసిన ట్రంప్ ఈసారి జెలెన్స్కీపై ప్రశంసలు కురిపించారు. యుద్ధ పరిస్థితుల్లో ఆయన సమర్థంగా నాయకత్వం వహిస్తున్నారని, శాంతి ఒప్పందానికి కూడా సానుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉక్రెయిన్‌కు అవసరమైన భద్రతా సహాయంపై అమెరికా మరింత సహకరిస్తుందని హామీ ఇచ్చారు. నాటో శిఖరాగ్ర సమావేశం ముగింపు సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఉక్రెయిన్ రక్షణ అవసరాల కోసం ఈ ఏడాది, వచ్చే ఏడాది కలిపి 80 బిలియన్ డాలర్ల సాయం అందించనున్నట్లు సభ్య దేశాలు ప్రకటించాయి. రష్యా నుంచి యూరో–అట్లాంటిక్ ప్రాంతానికి దీర్ఘకాలిక ముప్పు కొనసాగుతోందని నాటో స్పష్టం చేసింది.

## రక్షణ వ్యయాల పెంపుపై ఒత్తిడి

సభ్య దేశాలు తమ రక్షణ వ్యయాలను మరింత పెంచాలని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అమెరికాపై ఆధారపడకుండా యూరప్ దేశాలే తమ భద్రత బాధ్యతలను ఎక్కువగా చేపట్టాలని సూచించారు. రక్షణ వ్యయాల పెంపులో సభ్య దేశాలు పురోగతి సాధిస్తున్నాయని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టే పేర్కొంటూ ట్రంప్ నాయకత్వాన్ని ప్రశంసించారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడుల అనంతరం అమెరికా చేపట్టిన ప్రతీకార చర్యలను నాటో ప్రధాన కార్యదర్శి సమర్థించారు. ఇరాన్‌తో తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం తన దృష్టిలో ముగిసినట్లేనని ట్రంప్ వ్యాఖ్యానించినప్పటికీ, దౌత్య చర్చలు మాత్రం కొనసాగేందుకు అవకాశం ఇస్తామని తెలిపారు.

## సిరియాపై ఆంక్షల సడలింపుకు సంకేతం

సిరియాను ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాల జాబితా నుంచి తొలగించేందుకు అమెరికా ప్రభుత్వం సిద్ధమ వుతోంది. సిరియాతో సంబంధాల సాధారణీక రణ ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటు న్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. దీంతో అంత ర్జాతీయ పెట్టుబడులు, వాణిజ్యానికి మార్గం సుగమం అవుతుందని అమెరికా అభిప్రాయపడుతోంది.

## నాటో సభ్యత్వం కల్పించండి

ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం కల్పించాలని జెలెన్స్కీ మరోసారి విజ్ఞప్తి చేశారు. ఉక్రెయిన్ సైన్యానికి యుద్ధ అనుభవం సమృద్ధిగా ఉందని, తమ దేశం నాటో రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. అయితే ఉక్రెయిన్ నాటోలో చేరడాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

# చట్టానికి సోషల్ మీడియా కూడా జవాబుదారే

### ఎక్స్ సహకరించకపోతే ఉపేక్షించం: అలహాబాద్ హైకోర్టు



**ప్రయాగ్‌రాజ్:** భారత చట్టాలు, దర్యాప్తు సంస్థల నుంచి సోషల్ మీడియా వేదికలకు ఎలాంటి మినహాయింపు లేదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని న్యాయస్థానం ముందుకు తీసుకురావడానికి భారత చట్టాల పరిధి విస్తృతమైందని, దర్యాప్తుకు సహకరించ కుండా ఎలాంటి సంస్థ వ్యవహరించలేదని వ్యాఖ్యా నించింది. ఎక్స్ వేదిక సహకారం లేకపోవడంతో దర్యాప్తు నిలిచిపోయిందని పోలీసుల నివేదికపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషనర్‌ కు సంబంధించిన అసభ్యకర వీడియోలు, ఫొటోలు పోస్టు చేసిన ఖాతా వివరాలు, యూఆర్‌ఎల్ ఐడీ, ఐపీ అడ్రస్‌ను ఎక్స్ అందించడం లేదని దర్యాప్తు అధికారి కోర్టుకు తెలిపారు. దీంతో కేసు దర్యాప్తును ముందు కు తీసుకెళ్లలేకపోతున్నామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, సోషల్ మీడియా సంస్థల సహకారం లేకపోవడం వల్ల నేరస్తులు చట్టాన్ని తప్పించుకునే అవకాశం కలుగుతోందని వ్యాఖ్యానించింది.

## పోలీసింగ్ వైఫల్యమే: ధర్మాసనం

జస్టిస్ అజయ్ భానోత్, జస్టిస్ దివేశ్ చంద్ర సమంత్‌లతో కూడిన ధర్మాసనం, దర్యాప్తు అధికారి సమర్పించిన అఫిడవిట్‌ను పోలీసింగ్ వైఫల్యానికి ప్రాథమిక అంగీకారంగా అభివర్ణించింది. దర్యాప్తు సంస్థలకు సహకరించేలా సోషల్ మీడియా సంస్థల అధికారులను ఎందుకు బాధ్యత వహింపజేయలేకపో యారో వివరించాలని గాజియాబాద్ పోలీసు కమిషనర్‌ను ఆగస్టు 12న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.

## అసభ్య పోస్టులపై కేసు

గాజియాబాద్‌లోని ఇంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో మిథిలేశ్ కుమార్ అనే వ్యక్తి తన అసభ్యకర వీడియో లు, ఫొటోలు ఎక్స్‌లో పోస్టు చేశారని సమాచార సాంకేతిక చట్టం కింద ఫిర్యాదు చేశారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా, వేగంగా పూర్తి చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ హోంశాఖ కార్యదర్శి, డీజీపీకి కూడా కోర్టు ఉత్తర్వుల ప్రతులను పంపించాలని ధర్మాసనం ఆదేశించింది.



# నిలవాలంటే గెలవాల్సిందే

- నేడు ఇంగ్లాండ్‌తో భారత్ నాలుగో టీ20
- వరుస పరాజయాలతో ఒత్తిడిలో శ్రేయస్ సేన
- బ్యాటింగ్ వైఫల్యమే ప్రధాన ఆందోళన
- సిరీస్ కైవసం చేసుకోవాలన్న ఉత్సాహంలో ఇంగ్లాండ్

**బ్రిస్టల్:** వరుస ఓటములతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న టీమిండియా గురువారం జరిగే నాలుగో టీ20లో ఇంగ్లాండ్‌తో కీలక సమరానికి సిద్ధమైంది. సిరీస్‌లో ఇప్పటికే వెనుకబడిన భారత్‌కు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైన శ్రేయస్ అయ్యర్ సేన ఈ మ్యాచ్‌లో తప్పక గెలిచి సిరీస్‌లో నిలవాల్సిన పరిస్థితి నెలకొంది. భారత్‌ను తీవ్రంగా కలవరపెడుతున్న అంశం బ్యాటింగ్. ముఖ్యంగా మూడో టీ20లో 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు కేవలం 76 పరుగులకే ఆలౌటై 125 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. టీ20 చరిత్రలో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతిపెద్ద పరాజయం. ఆ మ్యాచ్‌లో నలుగురు మాత్రమే రెండంకెల స్కోరు చేయగా, అత్యధిక వ్యక్తిగత స్కోరు కేవలం 13 పరుగులే కావడం జట్టు దయనీయ పరిస్థితిని ప్రతిబింబించింది. అభిషేక్ శర్మను మినహాయిస్తే మిగతా బ్యాటర్లు ఎవరూ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, టాప్‌ఆర్డర్ బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరం ఉంది.

### జట్టులో మార్పులపై ఆసక్తి

సంజూ శాంసన్ స్థానంలో గత రెండు మ్యాచ్‌ల్లో అవకాశం పొందిన 15 ఏళ్ల వైభవ్ ఆశించిన ప్రభావం చూపలేకపోయాడు. దీంతో శాంసన్‌ను మళ్లీ జట్టులోకి తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. సిరీస్‌లో అతడికి మరో అవకాశం ఉండొచ్చని కోచ్ గౌతమ్ గంభీర్ సంకేతాలిచ్చారు. అలాగే శివమ్ దూబే స్థానంలో సూర్యాంశ్ షెడ్జే, అక్షర్ పటేల్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంగ్లాండ్ పేస్ ద్వయం జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ భారత బ్యాటర్లకు మరోసారి గట్టి పరీక్షగా మారనుంది. వీరి వేగం, కచ్చితత్వాన్ని ఎదుర్కోవడమే భారత్‌కు ప్రధాన సవాల్. మరోవైపు భారత బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని నియంత్రించాల్సి ఉంది.

### సిరీస్‌పై కన్నేసిన ఇంగ్లాండ్

సిరీస్‌లో 2–0 ఆధిక్యంలో ఉన్న హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లాండ్ పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా రాణిస్తున్న ఆ జట్టు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌ను ఖాయం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. గత 21 టీ20ల్లో 18 విజయాలు సాధించిన ఇంగ్లాండ్ జోరును కొనసాగించాలనే లక్ష్యంతో ఉంది. భారత్ ఈ మ్యాచ్‌లో గెలవాలంటే బ్యాటింగ్‌లో పుంజుకోవడంతో పాటు బౌలర్లు కూడా సమిష్టిగా రాణించాల్సిందే. లేదంటే సిరీస్ ఆశలు పూర్తిగా ముగిసే ప్రమాదం ఉంది.



తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష

## తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

- 2026 మెగా క్రీడలకు ఆతిథ్యం
- నవంబర్‌లో నిర్వహణకు అవకాశం

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ విషయాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బుధవారం ప్రకటించారు. ఈ మెగా క్రీడలను నవంబర్‌లో నిర్వహించే అవకాశమున్నట్లు తెలిపారు. గత ఏడాది మే నెలలో బిహార్ ఈ క్రీడలకు ఆతిథ్యమిచ్చింది. దేశవ్యాప్తంగా ప్రధాన క్రీడా ఈవెంట్లను విస్తరించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణకు ఈ అవకాశం కల్పించినట్లు మాండవీయ పేర్కొన్నారు. భారీ స్థాయి క్రీడలను నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు, క్రీడలపై ఆసక్తి తెలంగాణలో సమృద్ధిగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సుమారు 8 వేల మంది క్రీడాకారులు, అధికారులు, సహాయక సిబ్బంది పాల్గొనే అవకాశం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ క్రీడల విజయవంతమైన నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. బిహార్‌లో జరిగిన గత ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో 28 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. మొత్తం 26 రికార్డులు నమోదుకాగా, అందులో 13 జాతీయ యువ రికార్డులు వెయిట్‌లిఫ్టింగ్‌లో నమోదయ్యాయి. మిగిలిన రికార్డులన్నీ అథ్లెటిక్స్‌లో మీట్ రికార్డులుగా నిలిచాయి.

## ఆల్‌స్టార్స్ జట్టులో మెస్సీకి చోటు

- 29న లిగా ఎంఎక్స్ ఆల్‌స్టార్స్‌తో ప్రతిష్ఠాత్మక పోరు
- 29మంది సభ్యుల జట్టును ప్రకటించిన మేజర్ లీగ్ సాకర్



**షార్లెట్:** ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీకి మరో అరుదైన గౌరవం దక్కింది. జూలై 29న అమెరికాలోని నార్త్ కరోలినాలోని షార్లెట్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఎంఎల్ఎస్ ఆల్‌స్టార్ గేమ్‌కు మేజర్ లీగ్ సాకర్ (ఎంఎల్ఎస్) ప్రకటించిన 29 మంది సభ్యుల జట్టులో మెస్సీకి స్థానం లభించింది. ఈ మ్యాచ్‌లో ఎంఎల్ఎస్ ఆల్‌స్టార్స్ జట్టు, మెక్సికో లీగ్‌కు చెందిన లిగా ఎంఎక్స్ ఆల్‌స్టార్స్‌తో తలపడనుంది. ఇంటర్ మయామి తరఫున ఈ సీజన్‌లో మెస్సీ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటివరకు 14 మ్యాచ్‌ల్లో 12 గోల్స్, 8 అసిస్టులతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇదే జోరుతో ప్రపంచకప్‌లోనూ రాణిస్తూ అర్జెంటీనాను క్వార్టర్‌ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు.

### ఆడతాడా.. లేదా?

గత ఏడాది జరిగిన ఎంఎల్ఎస్ ఆల్‌స్టార్ మ్యాచ్‌కు మెస్సీ దూరంగా ఉండడంతో ఒక మ్యాచ్ నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. ఈసారి కూడా ప్రపంచకప్ షెడ్యూల్ కారణంగా అతను ఆల్‌స్టార్ మ్యాచ్‌లో పాల్గొంటాడా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఎంఎల్ఎస్ ఆల్‌స్టార్ జట్టులో మొత్తం 13మంది వరల్డ్‌కప్ ఆటగాళ్లకు అవకాశం లభించింది. మెస్సీతో పాటు థామస్ ముల్లర్, సన్ హ్యూంగ్–మిన్, రోడ్రిగో డి పాల్, టిమ్ రీమ్, స్టీవెన్ మొరీరా తదితర అంతర్జాతీయ స్టార్ ఫుట్‌బాలర్లు కూడా ఈ జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఈ మ్యాచ్ అభిమానులకు ఫుట్‌బాల్ వినోదాన్ని పంచే పోరుగా నిలవనుంది.

## ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో దాదా

- 54వ పుట్టినరోజున సౌరవ్ గంగూలీకి అరుదైన గౌరవం
- భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా సత్కారం



**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి 54వ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అత్యున్నత గౌరవాన్ని ప్రకటించింది. బుధవారం స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశంలో గంగూలీని ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చుతున్నట్లు ప్రకటించింది. దీంతో ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానం సంపాదించిన భారత క్రికెటర్ల సంఖ్య 12కు చేరింది. ఈ గౌరవంపై స్పందించిన గంగూలీ.. ఐసీసీకి, ఛైర్మన్ జై షాకు కృతజ్ఞతలు తెలిపారు. హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కడం తనకు ఎంతో గర్వకారణమని, భారత క్రికెట్ దిగ్గజాల సరసన నిలవడం మరింత ఆనందంగా ఉందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

### భారత క్రికెట్‌కు కొత్త దిశ

2000 నుంచి 2005 వరకు భారత జట్టుకు నాయకత్వం వహించిన గంగూలీ, మ్యాచ్ ఫిక్సింగ్ సంక్షోభం అనంతరం జట్టును పునర్నిర్మించి దూకుడైన జట్టుగా తీర్చిదిద్దారు. విదేశీ గడ్డపై చిరస్మరణీయ టెస్టు విజయాలు సాధించడంతో పాటు భారత క్రికెట్‌కు బలమైన పునాది వేశారు. ఇప్పటికే బిషన్‌సింగ్ బేడీ, సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్, వినూ మాంకడ్, అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, డయానా ఎడుల్జీ, వీరేంద్ర సెహ్వాగ్, నీతూ డేవిడ్, మహేంద్రసింగ్ ధోనీ ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు సంపాదించగా, ఇప్పుడు సౌరవ్ గంగూలీ కూడా ఆ జాబితాలో చేరారు.

Business

బిజినెస్

## యుద్ధభయంతో కుప్పకూలిన మార్కెట్లు

- సెన్సెక్స్ 1,677 పాయింట్లు.. నిఫ్టీ 517 పాయింట్లు పతనం
- అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలతో ముడిచమురు ధరలకు రెక్కలు
- ప్రపంచ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి



**ముంబై:** అమెరికా–ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఎగబాకడం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. బుధవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ రెండు శాతానికి పైగా నష్టపోయి ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలతో పాటు తొలి త్రైమాసిక ఫలితాలపై పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళన కూడా మార్కెట్ల పతనానికి కారణమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,677.12 పాయింట్లు (2.15 శాతం) పడిపోయి 76,503.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో 1,921 పాయింట్ల వరకు క్షీణించింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 516.65 పాయింట్లు (2.12 శాతం) కోల్పోయి 23,882.05 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో 3,211 షేర్లు నష్టాల్లో ముగియగా, కేవలం 1,070 షేర్లు మాత్రమే లాభపడ్డాయి. ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు 6 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 78.74 డాలర్లకు చేరుకుంది. ఇంధన సరఫరాపై ఆందోళనలు ప్రపంచ ఆర్థిక మార్కెట్లను కుదిపేశాయి. సెన్సెక్స్‌లోని అన్ని కంపెనీల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి.

# రూ.300 కోట్లతో నాగ్‌పూర్ విమానాశ్రయం విస్తరణ

- మూడుదశల్లో ఆధునికీకరణ
- వార్షిక ప్రయాణికుల సామర్థ్యం 3 మిలియన్ల నుంచి 30 మిలియన్లకు పెంపు
- కార్గో, లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి
- రెండో రన్‌వే, కొత్త టెర్మినల్, ఏరోసిటీ ఏర్పాటు
- దేశ, విదేశాల్లో కొత్త విమానాశ్రయాల అభివృద్ధి అవకాశాలను పరిశీలిస్తున్న జీఎంఆర్



**నాగ్‌పూర్:** నాగ్‌పూర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచస్థాయి విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రూ.300 కోట్ల ప్రారంభ పెట్టుబడితో బహుళ దశల విస్తరణ, ఆధునికీకరణ ప్రణాళికను ప్రకటించింది. గత నెలలో విమానాశ్రయ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన జీఎంఆర్, మూడుదశల్లో అభివృద్ధి పనులు చేపట్టి 30ఏళ్ల కన్సెషన్ కాలంలో వార్షిక ప్రయాణికుల సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 30 లక్షల నుంచి 3 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అవసరమైతే భవిష్యత్తులో 5 కోట్ల మంది ప్రయాణికులను నిర్వహించే స్థాయికి విస్తరించే అవకాశం కూడా ఉందని తెలిపింది. జీఎంఆర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్.జి.కె. కిశోర్, నాగ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ సీఈఓ శ్రీకాంత్ భండార్కర్ బుధవారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నాగ్‌పూర్ విమానాశ్రయ అభివృద్ధితో దేశ విమానయాన రంగంలో జీఎంఆర్ మరింత బలోపేతం అవుతుందని కిశోర్ తెలిపారు.

### మూడుదశల్లో అభివృద్ధి

మొదటి దశలో (12–18 నెలలు) ప్రస్తుతం ఉన్న టెర్మినల్‌ను ఆధునికీకరించడం, చెక్–ఇన్ కౌంటర్ల సంఖ్య పెంచడం, సెల్ఫ్ చెక్–ఇన్ కియోస్క్‌లు ఏర్పాటు చేయడం, ఎయిర్‌సైడ్, ల్యాండ్‌సైడ్ సదుపాయాలను మెరుగుపరచడం చేపడతారు. రెండో దశలో (3–4 ఏళ్లు) ఏడాదికి 40 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో కొత్త సమీకృత టెర్మినల్, కొత్త కార్గో టెర్మినల్ (ఏడాదికి 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం), అదనపు విమాన పార్కింగ్ సదుపాయాలు నిర్మించనున్నారు. మూడో దశలో (5–8 ఏళ్లు) రెండో రన్‌వే, కొత్త ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్, సాంకేతిక భవనం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు.

### 100 హెక్టార్లలో ఏరోసిటీ

దేశ భౌగోళిక కేంద్రంలో ఉన్న నాగ్‌పూర్, మిహాన్ (మల్టీ మోడల్ ఇంటర్నేషనల్ కార్గో హబ్ అండ్ ఎయిర్‌పోర్ట్) ప్రాజెక్టు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని ప్రధాన కార్గో, లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు జీఎంఆర్ తెలిపింది. దీర్ఘకాలంలో ఏడాదికి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహించే సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. జీఎంఆర్‌కు అప్పగించిన వెయ్యి హెక్టార్ల భూమిలో సుమారు 100 హెక్టార్లలో ఏరోసిటీని అభివృద్ధి చేసి విమానయానం, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, రిటైల్ రంగాలను సమగ్రంగా అనుసంధానించనున్నారు.

### కొత్త అవకాశాలపై దృష్టి

దేశీయ, అంతర్జాతీయంగా కొత్త విమానాశ్రయాల అభివృద్ధి అవకాశాలను జీఎంఆర్ పరిశీలిస్తోందని కిశోర్ తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ, హైదరాబాద్, గోవాలోని మోపా, నాగ్‌పూర్ విమానాశ్రయాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సంస్థ అభివృద్ధి చేస్తోందన్నారు. గ్రీస్‌లోని క్రేట్‌లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, ఇండోనేషియాలోని మెడాన్ విమానాశ్రయ అభివృద్ధిలోనూ జీఎంఆర్ భాగస్వామిగా ఉందని వివరించారు. భవిష్యత్తులో భారత్‌తో పాటు విదేశాల్లోనూ వచ్చే అవకాశాలను పరిశీలించి వాటిలో పాల్గొంటామని ఆయన తెలిపారు.

## మెటా 'మ్యూస్ ఇమేజ్'పై ఆందోళన

- ఇన్‌స్టాగ్రామ్ పబ్లిక్ ఫొటోలతో ఏఐ చిత్రాల సృష్టికి అవకాశం




**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా దిగ్గజం మెటా తన అత్యాధునిక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఇమేజ్ జనరేషన్ టూల్ 'మ్యూస్ ఇమేజ్'ను విడుదల చేసింది. మెటా సూపర్‌ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ అభివృద్ధి చేసిన తొలి మీడియా జనరేషన్ మోడల్‌గా దీన్ని సంస్థ ప్రకటించింది. అయితే ఈ కొత్త ఫీచర్‌పై డేటా గోప్యత, ఫొటోల వినియోగం, వినియోగదారుల అనుమతి (కన్సెంట్), డీప్‌ఫేక్‌ల ప్రమాదాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ టూల్ ద్వారా ఇన్‌స్టాగ్రామ్‌లోని పబ్లిక్ అకౌంట్లలో ఉన్న ఫొటోలను ఆధారంగా తీసుకుని, కేవలం యూజర్ నేమ్‌ను ప్రాంప్ట్‌లో పేర్కొనడం ద్వారా ఏఐ చిత్రాలను రూపొందించే అవకాశం ఉంది. పబ్లిక్ అకౌంట్లకు ఈ ఫీచర్ డిఫాల్ట్‌గా అమలులో ఉండటంతో వినియోగదారుల స్పష్టమైన అనుమతి లేకుండానే వారి రూపాన్ని పోలిన చిత్రాలు సృష్టించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల డీప్‌ఫేక్‌లు, వ్యక్తిత్వ దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలు పెరిగే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### వినియోగదారుల చేతుల్లోనే నియంత్రణ

అయితే తమ కంటెంట్‌ను ఏఐలో ఉపయోగించాలా వద్దా అనే నియంత్రణ వినియోగదారుల చేతుల్లోనే ఉంటుందని మెటా స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్ సెట్టింగ్స్‌లోని రీ యూజ్ కంటెంట్ ఎంపికను ఆఫ్ చేస్తే ఇతరులు తమ పబ్లిక్ కంటెంట్‌ను ఏఐ కోసం వినియోగించలేరని తెలిపింది. అలాగే మ్యూస్ ఇమేజ్ ద్వారా రూపొందిన ప్రతి చిత్రంలో కనిపించని కంటెంట్ సీల్ (ఇన్విజిబుల్ వాటర్‌మార్క్) ఉంటుందని, దాని ద్వారా ఏఐ రూపొందించిన చిత్రాలను గుర్తించే ప్రత్యేక డిటెక్షన్ టూల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం మ్యూస్ ఇమేజ్ మెటా ఏఐ యాప్, మెటా.ఏఐ, అమెరికాలోని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్, కొన్ని దేశాల్లో వాట్సాప్‌లో అందుబాటులో ఉండగా, త్వరలో ఫేస్‌బుక్‌లో కూడా ప్రవేశపెట్టనున్నారు. మ్యూస్ వీడియో ఫీచర్‌ను కూడా త్వరలో విడుదల చేయనున్నట్లు మెటా ప్రకటించింది. ఈ ఫీచర్ పబ్లిక్ సోషల్ మీడియా అకౌంట్ల అర్థాన్నే మార్చేస్తోందని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఇన్‌ఫ్లూయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లకు వ్యక్తిగత గుర్తింపుతో పాటు వాణిజ్యపరమైన విలువ కూడా ఉండటంతో, వారి రూపాన్ని అనుమతి లేకుండా ఏఐ ద్వారా వినియోగించడం నకిలీ ప్రకటనలు, బ్రాండ్ నష్టం, చట్టపరమైన వివాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. అలాగే వినియోగదారులు ఇకపై పబ్లిక్‌గా పంచుకునే ఫొటోల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

## బ్యాడ్ బాయ్ పిజ్జా విస్తరణకు ప్రణాళికలు

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఫుడ్ అండ్ బెవరేజెస్ (ఎఫ్అండ్‌బీ) వ్యాపారవేత్త కరణ్ తన్నా, ప్రముఖ ర్యాపర్ బాద్‌షా సంయుక్తంగా స్థాపించిన బ్యాడ్ బాయ్ పిజ్జా విస్తరణకు భారీ ప్రణాళికలు ప్రకటించింది. 2028 నాటికి వార్షిక పునరావృత ఆదాయాన్ని (ఏఆర్ఆర్) రూ.200 కోట్లకు పైగా పెంచడంతో పాటు దేశవ్యాప్తంగా 70కు పైగా అవుట్‌లెట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే 2029 నాటికి అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ మార్కెట్లలోకి ప్రవేశించాలని యోచిస్తోంది. తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ తన తదుపరి విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబరు నాటికి ముంబైలో మూడు, సూరత్, అహ్మదాబాద్‌లలో ఒక్కోటి చొప్పున మొత్తం ఐదు ఫ్లాగ్‌షిప్ ఎక్స్‌పీరియెన్షియల్ స్టోర్లను ప్రారంభించనుంది. 2027 డిసెంబరు నాటికి పశ్చిమ భారత్‌లో 30 అవుట్‌లెతో రూ.100 కోట్ల ఏఆర్ఆర్ సాధించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.



# చేనేతకు అండగా 'శోభిత'

అక్కినేని నాగచైతన్య సతీమణి, నటి శోభిత ధూళిపాళ మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. పెళ్లి తర్వాత కూడా నటిగా తన కెరీర్‌ను కొనసాగిస్తున్న శోభిత.. సోషల్ మీడియాలో కూడా చురుకుగా ఉంటూ సమకాలీన అంశాలపై స్పందిస్తున్నారు. తాజాగా భారతీయ చేనేత కార్మికుల కష్టాన్ని గుర్తుచేస్తూ, చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని ఆమె పిలుపునిచ్చారు. చేనేత అనేది కేవలం వస్త్రం కాదని, అది వేలాది మంది కార్మికుల జీవనాధారమని పేర్కొన్నారు. మనం ఖర్చు చేసే ప్రతి రూపాయి నేరుగా చేనేత కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలతో దిగిన కొన్ని ఫోటోలను కూడా శోభిత సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆమె సందేశానికి అభిమానులు, నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. చేనేతను ప్రోత్సహించాలంటూ అవగాహన కల్పిస్తున్న శోభితను పలువురు ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు. విశాఖపట్నంలో పెరిగిన శోభిత ధూళిపాళ 2013లో ఫెమినా మిస్ ఇండియా ఎర్త్ 2013 టైటిల్‌ను గెలుచుకుని గ్లామర్ ప్రపంచంలో అడుగుపెట్టారు. అనంతరం హిందీ, తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు సంపాదించారు. ఇటీవల నాగ చైతన్యను వివాహం చేసుకున్న ఆమె.. వ్యక్తిగత జీవితంతో పాటు సామాజిక బాధ్యతల పట్ల కూడా తన నిబద్ధతను చాటుకుంటున్నారు.

# కోలీవుడ్‌లో శివాజీకి క్రేజీ ఛాన్స్



తెలుగు చిత్రసీమలో ఒకప్పుడు హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శివాజీ, రాజకీయాల కారణంగా కొంతకాలం సినిమాలకు దూరమైన సంగతి తెలిసిందే. అనంతరం బిగ్‌బాస్ రియాలిటీ షోతో మళ్లీ ప్రేక్షకులకు చేరువైన ఆయన, రెండో ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతు న్నారు. కోర్ట్, దండోరా వంటి చిత్రాల్లో తన నటనతో ప్రశంసలు అందుకున్న శివాజీ, ఈ వారం విడుదల కానున్న లెనిన్ చిత్రంలోనూ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పుడు శివాజీకి కోలీవుడ్ నుంచి మరో భారీ అవకాశం లభించింది. లవ్ టుడే, డ్రాగన్, డ్యూడ్ చిత్రాలతో గుర్తింపు పొందిన నటుడు ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా రూపొందిస్తున్న కొత్త చిత్రంలో శివాజీ కీలక పాత్ర పోషించనున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక అనౌన్స్‌మెంట్ వీడియో ద్వారా అధికారికంగా వెల్లడించింది. పీఆర్ ఆల్ఫా యూనిట్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమిత బైజు కథానాయికగా నటిస్తుండగా, డ్రాగన్ దర్శకుడు అశ్వత్ మారిముత్తు కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. అదే వీడియోలో శివాజీ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. విడుదలైన ఈ లాంచ్ వీడియోకు ఒక్క రోజులోనే 10 మిలియన్ వ్యూస్ రావడం విశేషం. కోర్ట్, దండోరా చిత్రాల తర్వాత శివాజీ నటనకు ఇతర భాషల దర్శకుల నుంచి కూడా మంచి గుర్తింపు లభిస్తోంది. అదే కారణంగా ప్రదీప్ రంగనాథన్ స్వయంగా ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర కోసం ఆయనను ఎంపిక చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రం విజయవంతమైతే శివాజీకి కోలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళంలోనూ కీలక ప్రాజెక్టులతో శివాజీ తన రెండో ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.





# 'కాంతార: చాప్టర్ 2' స్క్రిప్ట్ పనులు షురూ

రైటింగ్, దర్శకత్వం, నటనతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నేషనల్ అవార్డు గ్రహీత రిషబ్ శెట్టి, నటుడిగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ దర్శకత్వాన్ని వదిలిపెట్టే ఆలోచన లేదని స్పష్టం చేశారు. తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'కాంతార: చాప్టర్ 2' కోసం ఇప్పటికే పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇతర చిత్రాల షూటింగ్‌లలో పాల్గొంటూనే తన రచయితల బృందంతో కలిసి ఈ చిత్రం స్క్రిప్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న 'జై హనుమాన్' చిత్రాన్ని పూర్తి చేసి, అనంతరం 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ రెండు చిత్రాలకు పూర్తిగా భిన్నమైన శారీరక మార్పులు, ప్రత్యేక లుక్స్ అవసరమవడంతో ఒకేసారి షూటింగ్ చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. అయితే ఈ రెండు సినిమాల చిత్రీకరణ కొనసాగుతున్న సమయంలో కూడా 'కాంతార: చాప్టర్ 2' స్క్రిప్ట్ పనులు నిరంతరాయంగా కొనసాగుతాయని రిషబ్ శెట్టి వెల్లడించారు.

# సూర్య బర్త్‌డేకు స్పెషల్ ట్రీట్



తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ **'విశ్వనాథ్ అండ్ సన్స్'** చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అం చనా లు నెలకొన్నా యి. వెంకీ అట్లూరి దర్శక త్వంలో రూపొందు తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్‌కు మంచి స్పందన లభించగా, ఇప్పుడు మరో ఆసక్తికర అప్‌డేట్‌ను చిత్రబృందం సిద్ధం చేసింది. సూర్య పుట్టినరోజు సందర్భంగా జూలై 23న ఈ చిత్రంలోని రెండో పాటను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా స్వయంగా హీరో సూర్య తన గాత్రాన్ని అందించడం విశేషం. జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ఈ పాట అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటుందని చిత్రవర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్య సరసన మలయాళ నటి మమితా బైజు కథానాయికగా నటిస్తుండగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని ఆగస్టు 14న థియేటర్లలో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# మహేష్ బాబు ఫన్నీ సీక్రెట్ రివ్యూల్

సూపర్ స్టార్ మహేష్ బాబు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర సంఘటనను ఆయన వదిన, బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ తాజాగా వెల్లడించారు. 'ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్' సీజన్–5 కార్యక్రమంలో పాల్గొన్న శిల్పా, మహేష్ బాబుతో జరిగిన సరదా సంఘటనను ప్రేక్షకులతో పంచుకున్నారు. నమ్రత శిరోద్కర్, మహేష్ బాబు వివాహమైన తొలినాళ్లలో మహేష్‌కు మరాఠీ భాష తెలియదని తాము భావించేవాళ్లమని, అందుకే ఏవైనా వ్యక్తిగత విషయాలు మాట్లాడుకోవాల్సి వస్తే తాను, నమ్రత ఇద్దరూ మరాఠీలోనే సంభాషించేవాళ్లమని చెప్పారు. అయితే కొన్ని సంవత్సరాల తర్వాత ఒక సందర్భంలో తాము మరాఠీలో మాట్లాడుకుంటుండగా మహేష్ బాబు అకస్మాత్తుగా అదే భాషలో స్పందించడంతో తామిద్దరం ఒక్కసారిగా ఆశ్చర్యపోయామని తెలిపారు. అనంతరం తనకు మరాఠీ అర్థమవుతుందని మహేష్ చెప్పడంతో ఇన్నాళ్లూ ఆ విషయాన్ని ఆయన తమకు తెలియనివ్వలేదని నవ్వుతూ గుర్తుచేశారు. "అదృష్టవశాత్తూ మేము ఎలాంటి పెద్ద రహస్యాలు మరాఠీలో మాట్లాడలేదు. లేకపోతే పరిస్థితి ఎలా ఉండేదో" అంటూ శిల్పా సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సంఘటనతో మహేష్ బాబు సెన్స్ ఆఫ్ హ్యూమర్‌తో పాటు భాషలపై ఉన్న పట్టు మరోసారి అభిమానులను ఆకట్టుకోగా, కుటుంబ సభ్యులతో ఆయన సరదాగా మెలిగే తీరు అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.







# నీ చిరునవ్వు, ధైర్యం ఎప్పటికీ గుర్తుంటాయి

టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల తెలంగాణలో అరుదైన వ్యాధితో బాధపడుతున్న తన 17 ఏళ్ల అభిమాని నిరంజన్‌ను కలిసి పరామర్శించిన విషయం తెలిసిందే. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్‌ను చూడాలని నిరంజన్ కోరుకోవడంతో ఆయన స్వయంగా ఇంటికి వెళ్లి కొంతసేపు కుటుంబ సభ్యులతో గడిపారు. ఆ సమయంలో పవన్, నువ్వే నా ఓజీ 2కి గెస్ట్ అంటూ అతడిని ప్రోత్సహించిన వీడియోలు, ఫొటోలు అభిమానులను కదిలించాయి. అయితే, నిరంజన్ మృతి చెందిన విషాద వార్త అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ సందేశం పంచుకున్నారు. నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. కొద్ది రోజుల క్రితం అతడిని కలిసిన క్షణాలు ఇంకా నా మదిలో సజీవంగానే ఉన్నాయి. తీవ్ర అనారోగ్యంతో పోరాడుతూనే నన్ను చూడగానే అతని ముఖంపై విరిసిన చిరునవ్వు ఎప్పటికీ మరువలేనిది. అతని శరీరం వ్యాధితో పోరాడినా, మనసు మాత్రం అపారమైన ధైర్యంతో నిలిచింది. అలాంటి ధైర్యవంతుడైన చిన్నారి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం ఎంతో బాధాకరం అని పేర్కొన్నారు. నిరంజన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన పవన్, ఈ తీరని దుఃఖాన్ని భరించే శక్తిని వారికి భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రియమైన నిరంజన్... నువ్వు చూపించిన చిరునవ్వు, ధైర్యం, ప్రేమ నా హృదయంలో ఎప్పటికీ నిలిచిపోతాయి. నీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అంటూ భావోద్వేగ నివాళి అర్పించారు.

# 'ఎల్లమ్మ' హీరోయిన్‌పై సస్పెన్స్



'బలగం' చిత్రంతో దర్శకుడిగా విశేష గుర్తింపు తెచ్చుకున్న వేణు యెల్దండి, తన తదుపరి చిత్రం 'ఎల్లమ్మ'ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. గత ఏడాదిగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ముఖ్యంగా కథానాయకుడి ఎంపికపై నెలల తరబడి కొనసాగిన ఉత్కంఠకు ఇటీవల తెరపడింది. తొలుత నేచురల్ స్టార్ నాని ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తారనే ప్రచారం జరగగా, అనంతరం నితిన్ పేరు కూడా వినిపించింది. అయితే చివరకు ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌ను హీరోగా పరిచయం చేస్తూ చిత్రబృందం అధికారిక ప్రకటన చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పుడు అదే స్థాయిలో కథానాయిక ఎంపికపై ఆసక్తి నెలకొంది. దేవిశ్రీ ప్రసాద్‌కు జోడీగా ఎవరు నటిస్తారన్న అంశంపై సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మొదట ఈ పాత్రకు సాయి పల్లవి పేరు బలంగా వినిపించినా, తాజా సమాచారం ప్రకారం ఆమెను సంప్రదించే ప్రయత్నం చిత్రబృందం చేయలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె పారితోషికం చిత్ర బడ్జెట్‌కు మించి ఉండటంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కన్నడ నటి రుక్మిణి వసంత్ పేరు ప్రధానం గా వినిపిస్తోంది. ఇప్పటికే ఆమెతో చర్చలు జరిగాయని, దాదాపు ఆమెనే కథానాయికగా ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. సమంత, కీర్తి సురేష్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చినప్పటికీ, బడ్జెట్ సమీకరణాల దృష్ట్యా రుక్మిణి వసంత్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దర్శకుడు వేణు యెల్దండి నటీనటుల ఎంపికను దాదాపు పూర్తి చేసినప్పటికీ, కథానాయిక విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచుతున్నారని తెలుస్తోంది. హీరో ప్రకటనకు ముందు నెలల తరబడి సస్పెన్స్ కొనసాగించిన చిత్రబృందం, ఇప్పుడు హీరోయిన్ విషయంలోనూ అదే వ్యూహాన్ని అనుసరిస్తుండటంతో అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ది ప్యారడైజ్ క్లైమాక్స్‌పై భారీ హైప్!

నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కు తున్న పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రంపై తాజాగా ప్రముఖ గేయరచయిత కాసర్ల శ్యామ్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తించాయి. ఈ సినిమాకు చార్ట్‌బస్టర్ పాట 'ఆయా షేర్'ను అందించిన కాసర్ల శ్యామ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. 'ప్యారడైజ్ క్లైమాక్స్... ఆపుకోలేక చెబుతున్నా.. నా మాట గుర్తుంచుకోండి' అంటూ క్లైమాక్స్‌ను ఆకాశానికెత్తేశారు. దీంతో చిత్ర క్లైమాక్స్ అత్యంత భారీ స్థాయిలో ఉండబోతోం దనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అంతేకా కుండా క్లైమాక్స్ చిత్రీకరణ కూడా పూర్తయిన ట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్ గా నటి స్తుండగా, అనిరుద్ రవిచంద ర్ సంగీతం అందిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ నిర్మిస్తు న్న ఈ భారీ ప్రాజెక్ట్ విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'మిమి' షూటింగ్‌లో ఎగ్ ఫ్రీజ్

బాలీవుడ్ నటి కృతి సనన్ తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, మిమి సినిమా చిత్రీకరణ సమయంలోనే తన అండాలను ఫ్రీజింగ్ పద్ధతిలో భద్రపరచుకున్నట్లు తెలిపారు. ''ఈ విషయాన్ని మొదటిసారి చెబుతున్నా. 'మిమి' కోసం బరువు పెరగాల్సి వచ్చింది. అందుకు ప్రత్యేక ఆహార నియమాలు పాటించాల్సి రావడంతో కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఎదురయ్యాయి. ఆ సమయంలో ఒకరు 'ఇది నీ భవిష్యత్తు కోసం నువ్వు ఇచ్చుకునే ఉత్తమ బహుమతి అవుతుంది' అని అండాలను భద్రపరచుకోవాలని సూచించారు. ఆ ఆలోచన నాలో నిలిచిపోయింది. బరువు పెరగాల్సిన దశలోనే ఈ ప్రక్రియ చేయించుకోవడం సరైన సమయంగా భావించాను'' అని చెప్పారు. 'మిమి' వంటి పాత్రల కోసం శారీరకంగా మార్పులు చేసుకోవాల్సి వచ్చినప్పుడు కొన్నిసార్లు హార్మోన్లకు సంబంధించిన చికిత్సలు కూడా అవసరం అవుతాయని, అలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తు కుటుంబ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని చాలామంది మహిళలు ఎగ్ ఫ్రీజింగ్‌ను ఎంచుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకున్న 'మిమి' చిత్రంలో, సరోగసీకి అంగీకరించిన ఓ యువతి జీవితంలో చోటుచేసుకునే అనూహ్య పరిణామాలు, ఆమె ఎదుర్కొన్న సామాజిక సవాళ్లు, మాతృత్వం చుట్టూ తిరిగే భావోద్వేగ కథను చూపించారు. ఈ సినిమాలో కృతి నటనకు విశేష ప్రశంసలు లభించాయి.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277